₹ 10

జనరాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

ఏప్రిల్ 1-16, 2011

సంపుటి 2 సంచిక - 7

పక్షపత్రిక




## భూ పందేరాల నిగ్గు తేల్చండి



అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీసిన జేపీ



## సంఘటితంగా వుంటే రైతులదే రాజ్యం






# అవినీతి రహిత భారతదేశం కోసం ఎన్నారైల దండియాత్ర – 2







# దండియాత్ర – 2 దృశ్యాలు











జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 2 సంచిక - 7 పక్షపత్రిక ఏప్రిల్ 1-15, 2011

## లోపలి పేజీల్లో...

భూపందేరాలలో అవినీతి మేటలు............5
భూ కేటాయింపులపై కాగ్ అక్షింతలు........ 6
విచారణ సభాసంఘం.......................... 8
1994 - 95 నుండి భూకేటాయింపులపై సమగ్ర విచారణ జరపాలి....................... 9
ఎమ్మెల్సీ ఎన్నికలలో నికృష్ట రాజకీయం.....10
ఉచితాల వరద పారిస్తున్న పార్టీలు...........14
ఆదాయపన్నులో అగ్రస్థానంలో ఆంధ్రప్రదేశ్..... 18
లోక్‌సభలో వస్తుసేవా పన్నుబిల్లు.............. 18
హాంకాంగ్‌లో అవినీతి కళ్ళెం................ 20
రైతుల ఆదాయాన్ని పెంచే వ్యూహం లేని కేంద్రబడ్జెట్........................................ 23
రైతులకు ఎక్కడైనా అమ్ముకునే స్వేచ్ఛ వుండాలి. 25
ఇండియా లీడర్‌షిప్ సర్వే...................... 26
రాష్ట్రంలో మహిళాన్యాయం, సహాయ సంఘాలు...28
బ్యాంకు అప్పుల్లో మహిళా పొదుపు సంఘాలు... 30
జిల్లాలలో లోక్‌సత్తా కార్యకలాపాలు.............. 33

## సంపాదకవర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

**డి.వి.వి.యస్. వర్మ**
సంపాదకులు

సంపాదక వర్గం
జి. రాజారెడ్డి
బండారు రామ్మోహన్‌రావు
కొంగర గంగాధరరావు
కె.వి. కుటుంబరావు
సి.హెచ్.ఎస్. మాధవరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి
డి.టి.పి : జ్యోతి తాటి
ఫోటోలు : ఎన్. సంజీవ్ కుమార్

# మంటగలుస్తున్న చట్టసభల ప్రతిష్ట

శాసనసభ బడ్జెట్ సమావేశాలు ముగిశాయి. సభ దేనికోసం ఉద్దేశించబడిందో ఆ బడ్జెట్ మీద చర్చ జరగకుండానే ద్రవ్యబిల్లు ఆమోదం పొందింది. ఈ సమావేశంలో చర్చించాల్సిన 15 బిల్లులలో 10 బిల్లులు చర్చలు లేకుండానే ఆమోదాన్ని పొందాయి. అందులో అతి ముఖ్యమైన కౌలుదారుల రక్షణ బిల్లు కనీసం ఆమోదం కూడా పొందకుండాపోయింది. లక్షలాది కౌలుదారుల ఆశలమీద చట్టసభ నీళ్లు చల్లింది. ప్రభుత్వపరంగా దానికి అవసరమైన ద్రవ్యబిల్లు, ఇతర బిల్లులకు అమోదం దక్కించుకుంది. సభ జరగనందున నిగ్గదీతలు, సమాధానాల బెడద ప్రభుత్వానికి చాలావరకూ తప్పింది.

చట్టసభలను చర్చల వేదికగానే కాకుండా సంఘర్షణకు వేదికగా ప్రతిపక్షాలు భావిస్తున్నాయి. తాత్కాలికంగా వచ్చే చౌకబారు ప్రచారానికి తాపత్రయ పడుతున్నాయి. ప్రభుత్వాన్ని నిలదీమడానికి బదులు సభ జరగకుండా చేసి ప్రజాప్రయోజనాలకు విఘాతం చేస్తున్నాయి.

ఈ సభ ప్రారంభంలోనే తెరాస, తెలుగుదేశం పార్టీ సభ్యులు గవర్నర్ ప్రసంగం మీద దాడి చేశారు. మైకులు విరగ్గొట్టారు. ఆయన కుర్చీని తన్నారు. బయట డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ పై హేయమైన దాడి చేశారు. సభను, సభ్యుల్ని భయభ్రాంతులను చేసే ఆటవిక పద్ధతులకు దిగజారారు. తర్వాత వారు శాసనసభ సమావేశాల్ని బహిష్కరించారు. అందులో తెదేపాలో ఒక ముక్క కూడా భాగస్వామి అయింది. సభలో ప్లకార్డు ప్రదర్శనలతో తెదేపా చివరిలో సాగించిన నిరసన ఘట్టం కొట్లాటకు దారితీసింది. సభలోనే సభ్యులపై మంత్రి చేయిచేసుకోవడం ఈ సభలో దౌర్జన్యకాండకు పరాకాష్ట అయింది.

సభలో ముప్పావు ముక్కతో మిగిలిన ప్రతిపక్షనేత సభను మరో 10 రోజులు నడవకుండా చేశారు. భూపందేరాల మీద సభాసంఘం వేస్తేనే చర్చ అంటూ సభను స్తంభింపజేశారు. అంతిమంగా చర్చ తర్వాతనే సభాసంఘానికి ప్రభుత్వం అంగీకరించింది. శాసనసభలో చర్చ జరిగిన ప్రతి సందర్భంలోనూ ప్రజలకు మేలు జరిగింది. సముద్రతీరం ధారాదత్తం మీద, విద్యుత్ సంస్కరణల మీద డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ చేసిన వాదనలకు ప్రభుత్వం అంగీకరించి సమీక్షకు సిద్ధపడింది.

చట్టసభల మీద ప్రజలకి విశ్వాసం పెరగాలంటే అక్కడ అర్థవంతమైన చర్చ జరగాలి. ప్రజాసమస్యలకు పరిష్కారాలు లభించాలి. ప్రతిపక్షం హేతుబద్ధంగా వ్యవహరించడం, ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం మీదనే చట్టసభలకు గౌరవం పెరుగుతుంది. ఇప్పటికైనా అందరూ ఆత్మపరిశీలన చేసుకుంటారని ఆశిద్దాం. ♦




*Sanketh Gurudatta* *indianink.org* సౌజన్యంతో...

# కార్టూన్ కార్నర్

సెల్‌ఫోన్‌ల యుగంలో...



## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
*ఇం.నం. 5-10-180/ఎ&ఎ1,*
*బ్యాంక్ లేన్స్, హిల్‌ఫోర్ట్ రోడ్,*
*హైదరాబాద్ - 500 004,*
*ఫోన్: 040-2323 1818*
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: *040-2323 1818.*

విడి ప్రతి : రు. *10* ,

ఏడాది చందా : రు. *200*

మూడేళ్ళ చందా : రు. *500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | కలర్ |
|---|---|---|
| 1/8 పేజీ (వి కార్డు) | రూ॥ 1000 | రూ॥ 1500 |
| 1/4 పేజీ | రూ॥ 2000 | రూ॥ 3000 |
| సగం పేజీ | రూ॥ 4000 | రూ॥ 6000 |
| పూర్తి పేజీ | రూ॥ 8000 | రూ॥ 12000 |
| సెంటర్ స్ప్రెడ్ | రూ॥ 12000 | రూ॥ 18000 |
| బ్యాక్‌పేజి | - | రూ॥ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | రూ॥ 15000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | రూ॥ 12000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# భూ పందేరాలలో...

# ...అవినీతి మేతలు




రాష్ట్రంలో కొద్ది సంవత్సరాలుగా ప్రజల ఆస్తుల్ని ప్రకృతి వనరుల్ని తాతల జాగీరులా అనుంగు సంస్థలకు దోచి పెట్టారని లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ మండిపడ్డారు. పరిశ్రమలు, సెజ్‌లు, ఇతర అవసరాల పేరుతో జరిపిన భూ కేటాయింపుల్లో అవినీతి, అధికార దుర్వినియోగం, బంధుప్రీతి తదితర ఆరోపణలకు సంబంధించి స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని చెప్పారు. భూ కేటాయింపులపై సభాసంఘాన్ని వేయడమే కాకుండా సీబీఐ ప్రత్యేక బృందంతో సమగ్ర దర్యాప్తు చేయించాలని పిలుపునిచ్చారు. స్పష్టత, ఆవేశం కలగలిసిన ఆయన ప్రసంగంలోని ముఖ్యాంశాలుల

- వోక్స్‌వ్యాగన్ కంపెనీ పేరుతో రూ॥10 కోట్లు ప్రజాధనం ఖజానా నుంచి ప్రైవేటు వ్యక్తుల పరమైనపుడు ప్రభుత్వం ఏం చేసింది?
- తేదేపా అధికారంలో ఉన్నప్పుడు ఐఎమ్‌జికి వందల ఎకరాలు కట్టబెట్టింది. ఆ రోజు ఏపీఐ ఐసీ ఎండీగా నేను దానిని అసంబద్ధ పథకంగా పక్కన పెట్టాను. ప్రభుత్వం ముందుకెళ్లింది. తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఒప్పందాన్ని రద్దు చేయడంతో ప్రజలు హర్షించారు. మళ్లీ కాంగ్రెస్ అలాంటి తప్పులకే తెగబడింది.
- సహజ వనరులు లేని, ఎందుకూ కొరగాని చిన్న దేశమైన రస్ అల్ ఖైమా ప్రభుత్వంతో 2008లో రాష్ట్ర ప్రభుత్వం గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో నౌకాశ్రయ నిర్మాణ ఒప్పందం చేసుకుంది. పేరుకు ప్రభుత్వాల మధ్య ఒప్పందం అన్నీ ఉల్లంఘనలే. కనీసం విచారణ చేయకుండా దౌత్యాధికారులు, ప్రభుత్వ ఉన్నతాధికారుల ప్రమేయం లేకుండా కేవలం మంత్రులు ఒప్పందంపై సంతకాలు చేశారు.



అసెంబ్లీలో సర్కారును నిలదీసిన జేపీ

- ఆధారాలున్నాయి సభాసంఘం వేయాలి
- సీబీఐ ప్రత్యేకంగా దర్యాప్తు చేయాలి
- రాచరికంలోనూ ఇంత దుర్మార్గం లేదు

- రస్ అల్‌ఖైమాకు నౌకాశ్రయ నిర్మాణంలో అనుభవం ఉన్నదీ లేనిదీ విచారించారా? అది 51 శాతం పెట్టుబడి పెడతానంది. ఒక శాతం అయినా పెట్టిందా? ఒప్పందాలు అమలు చేయని రస్‌అల్ ఖైమాతో కనీసం సంప్రదింపులు జరిపారా? అసలు మీరు నడుపుతున్నది ప్రభుత్వమా? పచారీ కొట్టా?
- రస్ అల్‌ఖైమాతో ప్రైవేటు సంస్థ వ్యాన్‌పిక్

ఒప్పందం చేసుకుంది. దానికి పెట్టుబడి ఎక్కడ నుంచి వచ్చింది? 10 వేల ఎకరాలకు పైగా ఆ కంపెనీకి కట్టబెట్టారు. రెండు ప్రభుత్వాల మధ్య ఒప్పందం అనిచెబితే పోటీ బిడ్డింగ్ ప్రస్తావన రాదనే ఉద్దేశంతోనే ఈ పని చేశారు.

- కేంద్ర ప్రభుత్వంలో ఆదాయ పన్నుల ఉన్నతాధికారి ఒకరు రాష్ట్రంలో ఏయే కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం అప్పనంగా భూములు కేటాయించిందీ, ఆ కంపెనీలు ప్రభుత్వంలో కీలక స్థానంలో ఉన్న వ్యక్తుల (వైఎస్) కుటుంబ సభ్యుల కంపెనీల్లో ఎలా పెట్టుబడులు పెట్టారో సవివరంగా నివేదిక ఇచ్చారు. (నివేదిక ప్రతిని జేపీ ఉప సభాపతికి చూపించారు.)
- భూములు, భవనాలు, ఆదాయం లేని, ఏడాదికి రూ॥321 కోట్ల నికర నష్టంలో ఉన్న ఒక కంపెనీ (జగతి పబ్లికేషన్స్)లో వ్యాన్‌పిక్ 19.44 లక్షల షేర్లు కొంది. ఈ కంపెనీలో ప్రమోటర్‌కు ఉన్నది. 2.30 లక్షల షేర్లే. రూ॥31 కోట్ల

# భూ కేటాయింపులపై కాగ్ అక్షింతలు

★ భూ కేటాయింపులపై సర్కార్‌కు కాగ్ మొట్టికాయలు రాష్ట్రంలోని భూముల కేటాయింపులో పారదర్శకత. ధర్మబద్ధత లోపించిందని 'కాగ్' వ్యాఖ్యానించింది. హిందుజా నేషనల్ పవర్ ప్రాజెక్టు గురించి ప్రత్యేకంగా ప్రస్తావించింది. ప్రభుత్వ వ్యవహారశైలి కారణంగా వివిధ వర్గాల వారికి రూ॥101.43 కోట్ల అనుచిత లబ్ధి చేకూరిందని తెలిపింది. చిత్తూరు, తూర్పుగోదావరి, కరీంనగర్, విశాఖపట్నం జిల్లాల్లో జరిగిన భూ కేటాయింపులను పరిశీలించిన మీదట 'కాగ్' ఈ అభిప్రాయానికి వచ్చింది. కాగ్ పేర్కొన్న అంశాలు..

★ హిందుజా నేషనల్ పవర్ కార్పొరేషన్‌కు 1999 ఏప్రిల్ – మే లో 1,222.38 ఎకరాలను రూ॥26.63 కోట్లకు ప్రభుత్వం కేటాయించినా రూ॥16.42 కోట్లకే అప్పగించారు.

★ 1998 ఏప్రిల్ 15న హిందుజాతో జరిగిన ఒప్పందం ప్రకారం నెలల్లో ఆర్థిక వనరుల సమీకరణ పూర్తి చేయాలి. 44 నెలల్లోగా ప్రాజెక్టు పూర్తి కావాలి. అయితే ఆర్థిక వనరుల సమీకరణ తేదీని సవరిస్తూ వచ్చారు.

★ 2007లో ఏపీ జెన్‌కో, ఎన్టీపిసీ వంటి సంస్థలు ఆ భూమిని కేటాయించాలని కోరాయి. టెండర్లు ఆహ్వానించాలని ఏపీట్రాన్స్‌కో కూడా కోరింది. అయినా ప్రభుత్వం ఈ అంశాన్ని పరిశీలించకుండా హిందుజా వద్దనే భూమిని ఉండనిచ్చింది.

★ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 2004 ఫిబ్రవరిలో ఇచ్చిన తీర్పు ప్రకారం ఈ భూమిపై హక్కులు ఆంధ్రప్రదేశ్ వక్ఫ్‌బోర్డుకు చెందుతాయని తేలింది.

★ 2008 ఏప్రిల్‌లో ప్రభుత్వ ఆదేశాల మేరకు వక్ఫ్‌బోర్డు 1999 నాటి రేట్లకు హిందుజా కు స్థలాన్ని రూ॥ 47.55 కోట్లకే విక్రయించింది. 2007 జనవరి మార్కెట్ విలువ ప్రకారం దీని విలువ రూ॥224.47 కోట్లు.

★ సెక్షన్ 51 ప్రకారం బహిరంగ వేలం ద్వారానే ఆస్తుల అమ్మకం జరగాలన్న నిబంధనలకు ఇది విరుద్ధం.

★ హయగ్రీమా ఫార్మ్స్ అండ్ డెవలపర్స్‌కు మార్కెట్ విలువ (రూ॥18.76 కోట్లు) అయినా రూ॥5.63 కోట్లకే ప్రభుత్వం విశాఖ రూరల్ మండలంలోని ఎండాడలో 12.51 ఎకరాల భూమిని కేటాయించింది.

★ మెసర్స్ సుదర్శన్ స్టీల్స్ లిమిటెడ్‌కు విశాఖ సమీపంలో ఎకరాకు రూ॥25 వేల చొప్పున 1998లో 5 ఎకరాలు కేటాయించినా ఆ సంస్థ పరిశ్రమను స్థాపించలేదు. భూ కేటాయింపును రద్దు చేస్తూ 2000 సంవత్సరంలో నోటీసు జారీ చేసినా పాత ధరకే మళ్ళీ 2008 సెప్టెంబర్ ఆసంస్థ భూమిని ఇచ్చారు. దీనివల్ల దానికి రూ॥3.74 కోట్ల అనుచిత లబ్ధి చేకూరింది.

★ ఎ.ఎమ్.జి. ఇండియా ఇంటర్నేషనల్ కాకినాడలో తనకు కేటాయించిన భూమికిగాను చదరపు గజానికి రూ॥1.400 చొప్పున చెల్లించడానికి ముందుకు వచ్చినా ప్రభుత్వం ఈ ధర ప్రకారం కూడా డబ్బులు వసూలు చేయలేదు. చదరపు గజం రూ॥500 చొప్పున 7.066 చదరపు గజాలు కేటాయించారు.

★ విశాఖ గ్రామీణ మండలంలోని మధురవాడలో గుర్తింపు పొందిన విలేకర్ల సంఘానికి 14 ఎకరాల భూమిని రూ॥60.98 కోట్లకుగాను రూ॥5.01 కోట్లకే కేటాయించారు.

విలువ చేసే వాటాకు వ్యాన్‌పిక్ రూ॥292 కోట్లు పెట్టుబడి పెట్టింది. కంపెనీలకు, భూ కేటాయింపులకు సంబంధం ఎలా ఉందో ఆదాయపన్ను అధికారి క్షుణ్ణంగా వివరించారు.

- అరబిందో గ్రూప్, వ్యాన్‌పిక్, హెటిరో గ్రూప్‌లకి మహబూబ్ నగర్ జిల్లా పోలేపల్లిలో ఏపీఐఐసీ పేరుతో పేదల నుంచి భూములు గుంజుకుని కేటాయించారు.
- కాకినాడ సీపోర్ట్స్ లిమిటెడ్ భూమి కోసం ఓఎన్‌జీసీ పేరుతో రైతులను నమ్మించి భూముల్ని బలవంతంగా లాక్కున్నారు. అక్కడి అధికార యంత్రాంగం కిరాయి గూండాల్లా, ప్రైవేటు సైన్యంలా ప్రవర్తించారు. 8800 ఎకరాలు సెజ్ పేరుతో తీసుకున్న ఆ కంపెనీకి చెందిన వ్యక్తి ఇప్పటివరకూ పైసా పెట్టుబడి పెట్టలేదు. ఎకరానికి రూ॥2 లక్షల చొప్పున ఇచ్చి సేకరించిన భూమిని రియల్ ఎస్టేట్ పేరుతో 15 నుంచి 20 రెట్లు ధరకు అమ్ముకున్నారు. నియంతలు, దుర్మార్గ రాజరికపాలనలోనూ ఇంత నిస్సిగ్గుగా వ్యవహరించలేదు.
- సామాన్యుల నుంచి భూములు లాక్కుని ఎమ్మార్ ప్రాపర్టీస్ పేరుతో వీఐపీలకు భవనాలు కట్టించారు. ఇందు ప్రాజెక్టు, బ్రహ్మణిలోనూ ఇదే జరిగింది. వందల ఎకరాల ప్రభుత్వ ఆస్తుల్ని ఏంవోయూల పేరుతో అనుంగుసంస్థలకు అప్పగించి, ముడుపులను మలేసియాకు తరలించి ప్రైవేటు ఆస్తులుగా వెనక్కి రప్పించుకున్నారు.
- విశాఖలో బ్రాండిక్స్‌కు 1000 ఎకరాలు, ఫ్యాబ్‌సిటీకి హైదరాబాద్‌లో 1074 ఎకరాలు ఏ ధరకు సేకరించి ఏ ధరకు ఇచ్చారు? కాంపిటీటివ్ బిడ్డింగ్ నిర్వహించారా?
- మైనింగ్‌లో ఎవరు ముందుకొస్తే వారికే అనే సూత్రంతో కాంపిటిటీవ్ బిడ్డింగ్ లేకుండా చేసి (గాలి జనార్ధనరెడ్డి కంపెనీలకు) వేలకోట్లు దోచిపెట్టారు. యాభైశాతం ఆదాయాన్ని ఉచితంగా అధికారంలో ఉన్న వ్యక్తుల కుటుంబ సభ్యుల (జగన్) కంపెనీల్లోకి వచ్చేలా ఏర్పాట్లు చేశారు. ఇంతకంటే ఏ సాక్ష్యం కావాలి?
- తీరప్రాంతంలో వందల ఎకరాలు ఒకే కంపెనీకి (వ్యాన్‌పిక్) కట్టబెట్టి గుత్తాధిపత్యానికి అవకాశం ఇచ్చారు.

**సూచనలు**

- పక్షపాతంతో కట్టబెట్టినట్లు స్పష్టమైన ఆధారాలుంటే తక్షణమే భూ కేటాయింపులు రద్దు చేయాలి.
- సిబీఐతో పూర్తిస్థాయిలో సమగ్ర దర్యాప్తు జరిపించాలి.
- అవినీతికి పాల్పడితే జైలులో పెట్టే చట్టం తేవాలి. కనీసం జిల్లాకు పదిమంది చొప్పున జైలుకి పంపించాలి.
- నిజమైన కంపెనీలకు కూడా అవసరానికి మించి భూమి కట్టబెట్టినట్లు ఉంటే వెనక్కి తీసుకోవాలి.
- అప్పనంగా భూములు, గనులు పొందిన కంపెనీల లాభాల నుంచి 80 శాతం ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. అప్పుడు ప్రభుత్వం అప్పులు చేయాల్సిన అవసరం ఉండదు.
- సహజ వనరులు కేటాయించడానికి కాంపిటిటీవ్ బిడ్డింగ్ నిర్వహించాలి.
- భూములు కేటాయించడానికి స్వతంత్ర సంస్థ ఏర్పాటు చేయాలి.
- దేవాదాయ, వక్ఫ్, క్రైస్తవ సంస్థల ఆస్తులకు రక్షణ కల్పించాలి.
- భూసేకరణలో ఆస్తులు కోల్పోయిన సామాన్యులకు అభివృద్ధి చేసిన ప్రత్యామ్నాయ భూముల్ని కేటాయించాలి.
- భూ కేటాయింపులపై సభాసంఘం వేసి అక్రమాలు జరిగాయని తేలితే పక్షపాతం, రాగద్వేషాలకు అతీతంగా చర్యలు తీసుకోవాలి. ♦



# విచారణకు సభాసంఘం

## శాసనసభలో ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి ప్రకటన

- **ప్రాథమిక సాక్ష్యాధారాలున్న వాటికే పరిమితం**
- **వక్ఫ్ భూముల కేటాయింపులకూ వర్తింపు**
- **ఎవరినీ ఉపేక్షించం**
- **నిబంధనలు పాటించకుంటే రద్దే**
- **నెల రోజుల్లో కొత్త పారిశ్రామిక విధానం**
- **శాసనసభలో ముఖ్యమంత్రి ప్రకటన**

అడ్డగోలు భూపందేరాలపై ప్రతిపక్షాల పోరాటం ఫలించింది. శాసనసభలో కొద్దిరోజులుగా నెలకొన్న ప్రతిష్టంభనకు తెరపడింది. అధికార దుర్వినియోగానికి పాల్పడి అస్మదీయులకు వేల ఎకరాలు కేటాయించారన్న విపక్షాల ఆరోపణలపై నిగ్గు తేల్చడానికి సభా సంఘం వేసేందుకు ప్రభుత్వం ఎట్టకేలకు అంగీకరించింది. ఈ మేరకు శాసనసభలో ముఖ్యమంత్రి మంగళవారం ప్రకటించారు. ప్రజల సొమ్ము ఒక్క పైసా కూడా పోకుండా కాపాడతామని స్పష్టం చేశారు.



పరిశ్రమల పేరుతో పేదల పొట్టగొట్టి పెద్దలకు వేల ఎకరాలు కట్టబెట్టారని, దీనిపై సంయుక్త సభాసంఘం (జేఎల్‌సీ) వేయాలని ప్రధాన ప్రతిపక్షం తేదేపాసహా విపక్షాలు ముక్తకంఠంతో తొమ్మిది రోజులుగా ఉభయసభల్లోనూ పట్టుబడుతున్నాయి. ఇన్ని రోజులుగా ఎటువంటి చర్చా లేకుండానే వాయిదాపడుతూ వస్తున్న శాసనసభ.. భూ కేటాయింపులపై సోమవారం చర్చ చేపట్టి మంగళవారం ముగించింది. చర్చకు సమాధానమిచ్చిన ముఖ్యమంత్రి.. జేఎల్‌సీపై ఎటువంటి ప్రకటనా చేయక పోవడంతో విపక్షాలు మరోసారి తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. దీంతో సభాసంఘం వేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు ముఖ్యమంత్రి ఎట్టకేలకు ప్రకటించారు. ప్రతిపక్ష పార్టీలతో సంప్రదించి విచారణ పరిధిలోకి తీసుకురావాల్సిన భూ కేటాయింపులను ప్రభుత్వం త్వరలో నిర్ణయిస్తుంది. ఇందులో వక్ఫ్‌బోర్డు భూములు కేటాయించిన 23 సెజ్‌లు ఉంటాయని ఉప సభాపతి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు.

**తేదేపా హయాంలోనూ లోపాలు:** "ప్రభుత్వాలు మారినప్పుడల్లా ప్రతి ఒక్కరూ ఇష్టం వచ్చినట్లు, వారికి దగ్గరగా ఉన్నవాళ్లకు భూములు ఇవ్వడం వెనక్కు తీసుకుంటామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి భూములు తీసుకున్న సంస్థలు నిబంధనలు పాటించకున్నా వాటిని రద్దు చేయడానికి వెనకాడబోమన్నారు. ఈ విషయంలో ఎవరినీ ఉపేక్షించబోమని, కఠిన నిర్ణయాలు కచ్చితంగా ఉంటాయని స్పష్టం చేశారు. వక్ఫ్‌బోర్డు భూముల పరిరక్షణ విషయంలో ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఇందుకు సంబంధించి అన్ని పార్టీలకు చెందిన మైనారిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. హజ్‌హౌస్ నిర్మాణానికి స్థలం కేటాయింపు అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని తెలిపారు.

**'జగతిపై ఆరోపణలు నిర్ధారణ అయితే చర్యలు**

జగతి పబ్లికేషన్స్‌లో పెట్టుబడులకు సంబంధించి ఆదాయపన్ను శాఖ జారీ చేసిన నోటీసులతో ప్రభుత్వానికి ప్రాథమిక సాక్ష్యాలు సమర్పించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెదెపా అధినేత చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లగా.. "ఒక వ్యక్తి, సంస్థలకు సంబంధించిన పెట్టుబడుల అంశాన్ని ఆదాయపన్నుశాఖ చూసుకుంటుంది. మీరు ఇచ్చిన పిటిషన్ అన్ని శాఖలకు పంపించాం. అక్కడ నుంచి సమాధానం వచ్చిన తరువాత చర్యలు తీసుకుంటాం." అని కిరణ్ చెప్పారు.

**విచారణకు సిద్ధం**

'పారిశ్రామిక అభివృద్ధికి విఘాతం కలగకుండా, ఉల్లంఘనలు జరిగాయని ప్రాథమిక సాక్ష్యాధారాలు ఉన్న నిర్దిష్ట కేటాయింపులపై సభాసంఘంతో విచారణకు ప్రభుత్వం సిద్ధం. తప్పులున్నాయని సభాసంఘం గుర్తిస్తే బాధ్యులపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం.' ♦

# 1994-95 నుండి భూ కేటాయింపులపై సమగ్ర విచారణ జరపాలి: జేపీ

భూముల కేటాయింపుల్లో అక్రమాలు జరిగినట్టు నిర్దిష్ట సాక్ష్యాలుంటే సభాసంఘం వేస్తామని శాసనసభలో ప్రభుత్వం ఇచ్చిన హామీని స్వాగతిస్తున్నామని, అయితే ఇది కొందరు వ్యక్తులకో, కొద్ది కాలానికో, కొన్ని కేసులకో పరిమితం చేయకుండా ఆర్థికసంస్కరణలు ప్రారంభమైన 1994-95 నుంచి జరిగిన అన్ని అక్రమాలపై విచారణ జరిపించాలని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ డిమాండ్ చేశారు. భూముల కేటాయింపులు, గనులు, తీరప్రాంతం, ఇతర సహజ వనరులన్నింటిలో అక్రమాలపై విచారణ జరగాలన్నారు. పార్టీలకు, వర్గాలకు అతీతంగా ఈ అంశంపై చర్యలుండాలని, ఎవరో ఒకరిని గురిపెట్టి చేయటమంటే అది శాసనసభను, ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయటమేనని అన్నారు. "ఈవేళ దేశవ్యాప్తంగా అవినీతి విపరీతమైపోయింది. 2-జీ స్పెక్ట్రం, గనులు, క్రీడలు తదితర విభాగాల్లో జరిగిన కుంభకోణాలతో అవినీతి పరాకాష్ఠకు చేరుకుంది. అవినీతిపై బహుముఖ పోరాటంలో భాగంగానే రాష్ట్రంలో అక్రమాలపై సమగ్ర విచారణను చూడాలి" అని పార్టీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ జేపీ స్పష్టం చేశారు.

లోతు తెలియకుండా జయప్రకాష్ నారాయణ్ దూకుతారని వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన బహిరంగలేఖలో చేసిన వ్యాఖ్యను ప్రస్తావిస్తూ... చాలా రాజకీయపార్టీలు వందల, వేల కోట్ల రూపాయలను లూటీచేసి ఆ డబ్బుతో ఎన్నికల్లో ఓట్లు కొనుగోలు చేసి మనుగడ సాగిస్తున్నాయని తనకు ఆలస్యంగా అర్థమైందని జేపీ అన్నారు. ఈవేళ లోతు పేరుతో ఆ పార్టీలు సుడిగుండంలో ఉన్నాయని, ఎన్నికలంటే డబ్బు ఖర్చు పెట్టటం, జనాన్ని తరలించటంగా మార్చివేశాయని, వ్యవస్థను అతలాకుతలం చేశాయని అన్నారు. రాజకీయం అంటే కొందరి అధికారం కోసం, పెత్తనం కోసం అన్నట్టు తయారుచేశాయని, అటువంటి లోతు, సుడిగుండాలు, మొసళ్లు ఉన్న రాజకీయాన్ని మార్చి పేదరికాన్ని నిర్మూలించే, యువతకు ఉపాధినిచ్చి భవిష్యత్తునందించే, అందరికీ ఎదిగే అవకాశాలను అందించే కొత్త రాజకీయం తెచ్చేందుకే లోక్‌సత్తా పార్టీ ఆవిర్భవించిందని అన్నారు.

తన తండ్రి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మాట్లాడని గ్రూపులు ఇప్పుడు ఆయన చనిపోయాక అవినీతిపై మాట్లాడుతున్నారని సోదరుడు జగన్ అన్న మాటలు సబబేనని, అధికార పార్టీలో ఉన్నవారికి ఇబ్బందిగా ఉంటే అవినీతి గురించి మాట్లాడటం, లాభం ఉంటే అవినీతి గుర్తుకు రాకపోవటం అవకాశవాదమేనని జేపీ అన్నారు. దీనికి అతీతంగా సభాసంఘం విచారణ, అవినీతి నిరోధక చట్టం చర్యలు ఉండాలన్నారు. ప్రైవేటు కంపెనీలు చేసిన కుట్రలు కనిపించలేదా అని ప్రశ్నిస్తున్నారని, రిలయెన్స్, ఈనాడు చేసిన తప్పులైనా సాక్ష్యాలుంటే చర్యలు తీసుకోవాల్సిందేనని స్పష్టంచేశారు. కానీ కార్పొరేట్ సంస్థలు, ప్రభుత్వం మధ్య మౌలికమైన తేడా ఉందని గుర్తించాలన్నారు. ప్రభుత్వంలో, రాజ్యాధికారంలో ఉన్నవారు చేసే అవినీతికి తేడా ఉందన్నారు. పాలకులకు గుత్తాధిపత్యం ఉంటుందని, వాళ్లు దోచుకునేది ప్రజల్ని, మన పన్నుల డబ్బుల్ని అన్నారు. రాజకీయ అవినీతి వల్ల ప్రతి పౌరుడూ నష్టపోతారన్నారు. అదే కంపెనీల దోపిడీ వల్ల ఆ కంపెనీల వాటాదారులు నష్టపోతారన్నారు. దీనిమీద ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. ఈ రెంటినీ ఒకే గాటన కట్టటం ప్రమాదకర వాదన అని స్పష్టంచేశారు.

దేశంలో సాక్ష్యాలతో దొరికినవారే అవినీతిపరులు అనుకోవాల్సిన పన్లేదని, దొరక్కుండా ఇంకా చాలామంది ఉన్నారన్నారు. ఎక్కడోకచోట ప్రక్షాళన మొదలు పెట్టాల్సుందన్నారు. ప్రస్తుతం అక్రమాల విచారణను ఆ పరిధిలోనే చూడాలన్నారు. అవినీతితో ఎడాపెడా సంపాదించిన పెద్దలు మిగిలినవారికి పంచుతున్నారని, ఎలాగోలా అధికారంలోకి రావటానికి వేలాదిమంది సభలకు తరలివస్తున్నట్టు కృత్రిమ హడావుడిని సృష్టిస్తున్నారన్నారు. గత ఐదేళ్లుగా ఉన్న ఆర్థిక బూమ్ వల్ల డబ్బు వెదజల్లి ఓట్లు కొనుగోళ్ల అలవాటు చేశారన్నారు. ఇందుకు పూర్తిగా ఆయా పార్టీలు, నేతలే బాధ్యత వహించాలన్నారు. ఇదో ఉన్మాదంలా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటకలో సాగుతోందని, లోక్‌సత్తా ఉద్యమం ప్రారంభమైనప్పుడు కూడా ఇంత తీవ్రంగా లేదని, ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే పరిణామాలు వికృతంగా, ప్రమాదకరంగా మారతాయని హెచ్చరించారు. ♦

## పతనమౌతున్న పార్టీల వ్యవస్థకు దర్పణం

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో నికృష్ట రాజకీయం

శాసనమండలికి చర్చలు చేసే అధికారమే తప్ప నిర్ణయాధికారం లేదు. కనీసం బిల్లుల్ని ఆమోదించకుండా నిలుపుచేయగల అధికారం కూడా లేదు. శాసనమండలి సభ్యునిగా ... అంటే ఎమ్మెల్సీగా ఉండటం ఓ హోదా మాత్రమే. ఎలాంటి అధికారాలు లేని పెద్దల సభలో సభ్యత్వం కోసం నికృష్ట రాజకీయాలకు పాల్పడటం తాజా ఎమ్మెల్సీ ఎన్నికల్లో మన కళ్లకు కట్టాయి.

2011, మార్చిలో రాష్ట్ర శాసనమండలికి నాలుగు కేటగిరీల్లో 26 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. 1. ఉపాధ్యాయ నియోజకవర్గాల నుంచి 2. పట్టభద్రుల నియోజకవర్గాల నుంచి 3. స్థానిక సంస్థల కోటాలో 4. ఎమ్మెల్యేల కోటాలో. ఇవికాకుండా గవర్నర్ నలుగురు ఎమ్మెల్సీలను నియమిస్తారు... అయితే ప్రజల ప్రమేయం లేకుండా కేవలం ప్రజాప్రతి నిధులు, రాజకీయ పార్టీల ప్రమేయంతో సాగిన స్థానిక సంస్థల, ఎమ్మెల్యే కోటా ఎన్నికల్లోనే ప్రజాస్వామ్యం పరిహాసం పాలైంది. లెక్కలు చూపని పదుల కోట్ల రూపాయలు చేతులు మారాయి. డబ్బు, మద్యం ఏరులై పారింది. క్రాస్ ఓటింగ్‌లతో పాటు ప్రధాన రాజకీయ ప్రత్యర్థి పార్టీలైన కాంగ్రెస్, తెలుగుదేశం మ్యాచ్‌ఫిక్సింగ్‌లకు పాల్పడి ప్రజల్ని నిస్సిగ్గుగా మోసం చేశాయి. ఉద్యమ పార్టీగా చెప్పుకుంటున్న తెలంగాణ రాష్ట్ర సమితి కూడా వీరికి జత కలిసింది. వారసత్వ రాజకీయసంస్కృతిలో భాగంగా వచ్చిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్... పుట్టి పదిహేను రోజులు కాకముందే ఈ వికృత రాజకీయ క్రీడను అలవోకగా ఆడేసింది. సాంప్రదాయ రాజకీయ సంస్కృతికి పరాకాష్ఠగా నిలిచింది. గవర్నర్ కోటాలో నియామకాల్లో కూడా ఇదే రాజకీయ భ్రష్టత్వం కనిపిస్తోంది. గవర్నర్ నామినేట్ చేసే ఎమ్మెల్సీలు సాహిత్యం, సైన్స్, సహకార ఉద్యమం, సామాజిక సేవ రంగాలలో నిష్ణాతులై ఉండాలని ఆర్టికల్ 171 (5) స్పష్టంచేస్తున్నా, దాన్ని ఉల్లంఘించి గతసారి ఒకేఒక్క వ్యక్తిని అలా రాజ్యాంగస్ఫూర్తితో నియమించారు. ఈ ఏడాది కూడా మండలిని రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని, తుది జాబితాలో రాజకీయ పక్షులే తప్ప ఎగువసభకు విశ్వసనీయత తెచ్చే, చర్చల్లో విషయ పరిజ్ఞానం, ప్రామాణితకను తేగలిగే విజ్ఞత గలవారి ఎంపిక లేదని సమాచారం.

- కట్టు తప్పిన ప్రజాప్రతినిధులు
- క్రాస్ ఓటింగ్‌లతో కంగుతిన్న పార్టీలు
- విప్‌ల ధిక్కరణలు.. కోడ్‌ల ఉల్లంఘనలు
- కాంపుల హోరు... కేబరేల జోరు
- అమ్ముడైన నేతలు.. విస్తుపోయిన ప్రజలు

**స్థానిక సంస్థల, ఎమ్మెల్యేల కోటాలో...**

రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, తెలుగుదేశం స్థానిక సంస్థల కోటాలో ప్రజాస్వామ్యానికి పాతరేస్తూ క్యాంప్ రాజకీయాల్ని నిర్వహించాయి. వాటి అభ్యర్థులు క్యాంపుల్లో కోట్ల రూపాయల డబ్బు విరజిమ్మి, మద్యం, రికార్డింగ్ డ్యాన్సులతో అభ్యర్థుల్ని లోబరుచుకునే ప్రయత్నం చేశారు. ఓటర్లుగా ఉన్న తమ ప్రజాప్రతి నిధులపై పార్టీలకు కట్టుచెదిరిపోయింది. ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు తాము ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీతో సంబంధం లేకుండా క్రాస్ ఓటింగ్‌లకు పాల్పడ్డారు. ఎమ్మెల్సీల్ని ఎన్నుకోవాల్సిన ప్రజాప్రతినిధులు డబ్బుకు, ప్రలోభాలకు లంగి ఓట్లు అమ్ముకోవటం ఒక ఎత్తయితే, ఆయా పార్టీల అధినాయకత్వం కూడా ప్రత్యర్థి పార్టీలతో రహస్య ఒప్పందాలు కుదుర్చుకుని ప్రజల్ని మోసం చేశాయి. డిసెంబర్ 9, 2009న ప్రత్యేక తెలంగాణ ప్రక్రియపై ప్రకటన అనంతరం చెల్లాచెదురైన ప్రధాన రాజకీయ పార్టీలు ఈ ఎన్నికల్లో పూర్తిగా కనుమరుగయ్యాయి. ఏ పార్టీ ఎక్కడ ఎవరితో పొత్తుపెట్టుకుంటుందో, ఎవరితో మ్యాచ్‌ఫిక్సింగ్ చేసుకుందో, ఎక్కడ ఎవరి ఓట్లను చీల్చి ఎవరిని గెలిపిస్తుందో అంతుచిక్కలేదు.

కొత్తగా వచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ కూడా ఈ క్రీడలో భాగస్వామి అయ్యింది. ఒకచోట కాంగ్రెస్‌తో తెలుగుదేశానికి రహస్య ఒప్పందం ఉంటే, మరోచోట వైఎస్సార్ కాంగ్రెస్‌తో తెలుగుదేశం జతకట్టటం రాజకీయాలు ఎంత కుళ్లిపోయాయో, ఎన్నికల వ్యవస్థ ఎంత లోపభూయిష్టంగా ఉందో కళ్లకు కట్టాయి. కొన్నిచోట్ల క్రాస్ ఓటింగ్‌లో కూడా డబుల్ క్రాసింగ్ జరిగిందని వివిధ జిల్లాల్లో ఎన్నికల సరళిని బట్టి అర్థమవుతుంది.

కడప జిల్లాలో 624మంది స్థానిక సంస్థల ప్రతినిధులకు ఓటు హక్కు ఉంటే, వారిలో 122మంది టీడీపీ నేతలుకాగా మిగిలిన 493మంది కాంగ్రెస్ పార్టీ ద్వారా ఎంపికయ్యారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగానే కాంగ్రెస్, టీడీపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల మధ్య క్యాంపు రాజకీయాలు, డబ్బుల పంపిణీ యధేచ్ఛగా మొదలైంది. మధ్యలో టీడీపీ గంపగుత్తగా కాంగ్రెస్ పార్టీకి తన ప్రతినిధులను అమ్మేసినట్టు విశ్వసనీయ వార్తలు వచ్చాయి. రూ.1లక్షతో మొదలైన రేట్లు చివరికి ఎంపీటీసీకి రూ.10లక్షల వరకూ చెల్లించేస్థాయికి చేరుకుందిక్కడ. చిత్తూరులో కూడా జగన్ వర్గ అభ్యర్థిని ఓడించేందుకు కాంగ్రెస్, తెలుగుదేశం రెండో ప్రాధాన్యతా ఓట్లను పరస్పరం బదిలీ చేసుకున్నట్టు తెలుస్తుంది. ఈ మేరకు సాక్షాత్తూ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడే సమాచారాలు పంపినట్టు వార్తలు సూచిస్తున్నాయి. పైనుంచే అనైతికతను ప్రోత్సహిస్తుంటే ఇక ప్రజాస్వామ్య పతనం అడ్డూఆపూ లేకుండా సాగిపోయింది. అనంతపురంలో కాంగ్రెస్ వారితోపాటు జగన్ వర్గం టీడీపీకి మద్దతు పలికినట్టు స్పష్టంగా తెలుస్తుంది. తూర్పు గోదావరి జిల్లాలో తెలుగుదేశం వారు మందు, విందుతో మహిళా నృత్యకారిణులతో జాతీయ రహదారి పక్కన నిర్వహించిన క్యాంపును ఒక వార్తాఛానెల్ ప్రసారం చేసింది. ఇందులో ఆయా మహిళలతో కలిసి డ్యాన్సులు చేయటంతోపాటు వారికి తమ భూరివిరాళాల్ని కూడా సదరు స్థానిక ప్రతినిధులు కరెన్సీ నోట్లను వెదజల్లటం ద్వారా ప్రకటించారు. ఈ జుగుప్సాకర రాజకీయ సన్నివేశాన్ని చూసిన అశేష ప్రజలు అవాక్కయ్యారు. నెల్లూరు జిల్లాలోనూ అధినాయకత్వాలు అనైతిక రాజకీయాలకు ఆదేశాలు ఇవ్వగా స్థానిక ప్రతినిధుల్లో అధికశాతం వాటిని తమకు అనుగుణంగా మలచుకుని లాభపడ్డారు.

ఇక రాష్ట్ర శాసనసభ్యుల కోటాలో అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యేలు యధేచ్ఛగా క్రాస్ ఓటింగ్‌కు పాల్పడటం వల్ల ఎ.ఐ. ఎం.ఐ.ఎం అభ్యర్థి రిజ్వీకి అత్యధిక ఓట్లు లభించి, కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ జానీ అతికష్టం మీద గట్టెక్కారు. మరో కాంగ్రెస్ అభ్యర్థి రంగారెడ్డి

**2011, మార్చిలో జరిగిన ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఎన్నికల్లో గెలుపొందినవారు:**

**ఎమ్మెల్యే కోటాలో (10)...**

పాలడుగు వెంకట్రావు, బత్సల చెంగల్రాయుడు, మాకం రంగారెడ్డి, సుధాకర్ బాబు, మహ్మద్ జానీ (కాంగ్రెస్), గంగాధర్ గౌడ్, సతీష్ రెడ్డి (టీడీపీ), పీజే చంద్రశేఖర్ రావు (సీపీఐ), అల్తాఫ్ హైదర్ రిజ్వీ (ఎఐఎంఐఎం), సి. రామచంద్రయ్య (పీఆర్పీ)

**స్థానిక సంస్థల కోటాలో (10)...**

వాకాటి నారాయణ రెడ్డి (కాంగ్రెస్-నెల్లూరు జిల్లా), ఎస్వీ మోహన్ రెడ్డి (కాంగ్రెస్-కర్నూలు), పి. విశ్వప్రసాద రావు (కాంగ్రెస్-శ్రీకాకుళం), బొడ్డు భాస్కర రామారావు (టీడీపీ-తూర్పు గోదావరి), అంగర రామమోహన్ (టీడీపీ- పశ్చిమ గోదావరి) మెట్టు గోవిందరెడ్డి (టీడీపీ-అనంతపురం), సీహెచ్ నారాయణ రెడ్డి (స్వతంత్ర (వైఎస్సార్ కాంగ్రెస్)- కడప), మేకా శేషుబాబు (స్వతంత్ర (వైఎస్సార్ కాంగ్రెస్)- పశ్చిమ గోదావరి), తిప్పారెడ్డి (స్వతంత్ర (వైఎస్సార్ కాంగ్రెస్)- చిత్తూరు), సయ్యద్ అమీనుల్ హసన్ జాఫ్రి (ఎఐఎంఐఎం-హైదరాబాద్).

**ఉపాధ్యాయుల నియోజకవర్గాలలో (3)...**

వి. బాలసుబ్రమణ్యం (ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు), బి. పుల్లయ్య (కడప-అనంతపురం-కర్నూలు), కె. జనార్థన రెడ్డి (మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్)

**పట్టభద్రుల నియోజకవర్గాలలో (3)...**

ఎం.వి.ఎస్ శర్మ (శ్రీకాకుళం-విజయనగరం-విశాఖపట్నం), వై. శ్రీనివాసులు రెడ్డి (ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు), డాక్టర్ ఎం. గేయానంద్ (కడప-అనంతపురం-కర్నూలు)

(ఎమ్మెల్సీ ఎన్నికల్లో లోక్‌సత్తా పార్టీ మద్దతిచ్చినవారిలో నలుగురు అభ్యర్థులు ఎం.వి.ఎస్ శర్మ, వి. బాలసుబ్రమణ్యం, వై. శ్రీనివాసులు రెడ్డి, పి.జె చంద్రశేఖర రావు, ద్వితీయ ప్రాధాన్యతా ఓటు మద్దతులో డాక్టర్ గేయానంద్ గెలుపొందారు)

అదనంగా ఓట్లు పొంది గెలిచారు. తెలంగాణ ఉద్యమం దాదాపు ఏడాదిన్నరగా రాష్ట్రాన్ని కుదిపేస్తున్నా టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడి పార్టీకి వెన్నుపోటు పొడిచారు. ఉద్యమకారుల నుంచి వచ్చిన ఒత్తిడి వల్ల వారిని సస్పెండ్ చేసినా, తామేమీ తప్పు చేయలేదని, పార్టీ అధినాయకత్వం చెప్పిన తీరుగానే ఓటువేశామని వారు వాదిస్తుండటం అనేక శేషప్రశ్నలకు తెరతీసి రాజకీయాల పట్ల ప్రజల్లో జుగుప్సను మరింత పెంచుతోంది.

**ఉపాధ్యాయ, పట్టభద్ర నియోజకవర్గాలలో...**

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీల, వాటి ప్రజాప్రతినిధుల ప్రభావం తక్కువగా ఉన్నది విద్యావంతులైన ప్రజల ప్రమేయం ఉన్నచోట మాత్రమే. ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాలలోనే. ఉద్యమ స్ఫూర్తి కలిగిన సంఘాలు, వ్యక్తులు ఇక్కడ మంచి ఫలితాలు సాధించాయి. పట్టభద్రుల నియోజకవర్గాల్లో కేవలం విద్యావంతులైన ప్రజలే చైతన్యవంతంగా ఓటు వేసి మంచి అభ్యర్థులను గెలిపించుకున్నారు. సాధారణ పౌరులే ఎన్నికల్లో పోటీ చేసి ఈ స్థానాల్లో నెగ్గారు. ఇక్కడ ప్రధాన రాజకీయ పార్టీలు భారీగా ఖర్చుచేసినా, హంగుఆర్భాటాల్ని ప్రదర్శించినా విద్యావంతులు మంచి అభ్యర్థులవైపే మొగ్గుచూపారు. ప్రజాస్వామ్యంలో అసలైన ప్రభువులు ప్రజలేనని, వాళ్లు తలచుకుంటే ధనరాజకీయం చిత్తుగా ఓడుతుందని నిరూపించారు. ఉత్తరాంధ్రలో పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి ఎం.వి.ఎస్ శర్మకు వ్యతిరేకంగా కాంగ్రెస్, తెలుగుదేశం ఎంత ప్రచారం చేసినా ఆయన భారీ మెజారిటీతో తిరిగి ఎన్నికయ్యారు. అక్కడ ప్రజాసంఘాలు, లోక్‌సత్తా, సీపీఎం ఆయనకు మద్దతు పలికాయి. అలాగే ప్రకాశం-నెల్లూరు-చిత్తూరులో వై. శ్రీనివాసులు రెడ్డి గెలుపు. అయితే ఓటింగ్ శాతం 46.53శాతం ఉండటమే ఆందోళనకర అంశం. ఉపాధ్యాయుల నియోజకవర్గంలో నిబద్ధతతో కృషి చేసి సీపీఎం మంచి ఫలితాలు సాధించింది.

**గవర్నర్ కోటాలో నియామకం...**

నలుగురిని నియమించాలి. (విద్యావేత్త కోలా రాజ్యలక్ష్మి మరణంతో అదనంగా మరో ఖాళీని కూడా భర్తీచేస్తున్నారు)... సీవీసీ నియామకంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో సభను రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చకుండా సభ పనిచేసేలా చూసే సరైన వాళ్లని, మంచి ప్రమాణాలున్నవారిని పార్టీల కతీతంగా నియమించాలని జయప్రకాష్ నారాయణ్ మార్చి 3వ తేదీన గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌కు లేఖ రాశారు. మండలికి తాజాగా చేసే నియామకాల్లో తమ పార్టీకి చెందిన వారిని నియమించాలని అధికార పార్టీకి, ప్రభుత్వానికి చెందిన ముఖ్యులు ఇటీవల బహిరంగంగానే కోరుతున్నారని గుర్తుచేశారు. గతంలో పార్టీతో అనుబంధం ఉండటం నామినేషన్‌కు అనర్హత కాకపోయినా, కేవలం పార్టీ ప్రయోజనాల కోసం పనిచేయటం అర్హత కాకూడదన్నారు. ఎగువసభకు నామినేషన్లను రాజకీయ పార్టీల ప్రైవేటు వ్యవహారంగా చూడటం రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధమన్నారు. కాబట్టి రాజ్యాంగం నిర్దేశించిన రంగాలలో నిష్ణాతులైన విజ్ఞులను ఎమ్మెల్సీలుగా నియమించాలని గవర్నర్‌ను కోరారు. "ఈ సభ్యుల నియామకంలో మీరు మంత్రిమండలి సలహాను పాటించాల్సి ఉన్నా అర్హులైన నిష్ణాతుల్నే ఆ స్థానాల్లో నియమించేలా ప్రభుత్వానికి సలహా ఇచ్చి గట్టిగా సూచించటం మీ రాజ్యాంగబద్ధ బాధ్యత" అని జేపీ గవర్నర్‌కు రాశారు. అయితే ఇంతకుముందే చెప్పుకున్నట్టు ఈసారి కూడా గవర్నర్ కోటాలో రాజకీయ నియామకాలే జరిగేందుకు దాదాపు రంగం సిద్ధమైంది.

**ప్రత్యామ్నాయ రాజకీయం కోసం ఆలోచనాపరులు, మధ్య తరగతి, యువత కదలాలి**

కడపలో జగన్ గెలవకుండా చూసేందుకు మహ్మద్ జానీని దెబ్బతీశారనే వంకతో ముస్లింలను ఆకట్టుకునేందుకు ముఖ్యమంత్రి ప్రయత్నిస్తారని, ఆ వ్యూహాన్ని పసిగట్టే జగన్ వర్గం ఎమ్మెల్యేలు ఎ.ఐ.ఎం.ఐ.ఎం వారికి ఓటు వేశారని, వైఎస్సార్ కాంగ్రెస్ రాష్ట్రంలో మూడవ ప్రధాన రాజకీయ శక్తిగా ఎదుగుతుందని ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. మీడియా ఊదరగొడుతోంది. సీఎంకు మూడు సీట్లలో భంగపాటు వల్ల కాంగ్రెస్‌కు రాష్ట్రంలో కష్టకాలం వస్తుందని కొందరంటే, కాదు కడపలో అడ్రస్ ఉండదనుకున్న కాంగ్రెస్ కనీసం జగన్‌కు దీటుగా నిలిచిందని మరికొందరు వాదిస్తున్నారు. తెలుగుదేశం రెండు చోట్ల అదనంగా గెలిచినా ఆత్మరక్షణలో ఉందని, అస్తిత్వ సంక్షోభం ఆ పార్టీకి పెద్ద సమస్యగానే ఉంటుందని పేర్కొంటున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్, టీఆర్ఎస్ చివరికి కాంగ్రెస్‌లోనే విలీనమవుతాయని జోస్యం చెబుతున్నారు. ఈ విలీనం జరిగి కాంగ్రెస్ వ్యతిరేకత వెల్లువెత్తి తాము గట్టెక్కుతామనే ఆశలో టీడీపీ ఎదురు చూస్తుందంటున్నారు... ఈ ఊకదంపుడు విశ్లేషణల్లో నిజానిజాలు ఎలావున్నా ఇవి కేవలం ఈ ఎన్నికల్ని పార్టీలకు

సంబంధించిన అంశంగా చూసే కోణాలు మాత్రమే. కానీ ప్రజాస్వామ్యంలో నిజమైన ప్రభువులైన ప్రజలకు సంబంధించిన కోణం ఇందులో ఏమీ లేదు. వీటిలో ఏ పార్టీ గెలిచినా ప్రజలకు ఒరిగేదేమీ లేదు. టీఆర్ఎస్, వైఎస్సార్ కాంగ్రెస్‌లు విడిగానే కొనసాగినా, కాంగ్రెస్‌లో విలీనమైనా వచ్చే మార్పేమీ ఉండదు. ఆ పార్టీల లేబుళ్లు మారతాయి తప్ప మిగిలిన విషయాల్లో అందరూ ఒకటే. ఆ పార్టీలు లేదా టీడీపీ... వారిలో ఎవరిని ఎన్నుకున్నా ప్రజలకు పెనం మీద నుంచి పొయ్యిలో పడటం అవుతుంది తప్ప ప్రత్యామ్నాయ పార్టీని ఎన్నుకున్నట్టవదు. వారి పాలనలో మెజారిటీ ప్రజలు బిచ్చగాళ్లుగానే కొనసాగుతూ తాయిలాల కోసం ప్రభుత్వాల ముందు చేయిజాపేవారుగానే కొనసాగుతారు తప్ప వారి జీవితాల్లో ఎటువంటి చెప్పుకోదగిన మార్పూ రాదు.

కాంగ్రెస్, తెలుగుదేశం, టీఆర్ఎస్, వైఎస్సార్ కాంగ్రెస్...

ఈ నాలుగు పార్టీల పేర్లు, జెండాలు వేరు తప్ప ఒకే రకం పార్టీలు.

ఈ పార్టీలకు ఎలాగోలా అధికారంలోకి రావటం తప్ప వేరే విధానాలంటూ లేవు.

ఈ పార్టీలకు చాలాచోట్ల నాయకులు కూడా ఒకటే.

డబ్బు, మద్యం, ప్రలోభాలతో తప్ప విధానాలు, విలువలతో ప్రజలను ప్రభావితం చేయలేని పార్టీలివి.

అధికారం కోసం రాష్ట్రాన్ని, దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని కూడా అలవోకగా ఫణంగా పెట్టగలవు ఈ పార్టీలు

... అని తాజా ఎమ్మెల్సీ ఎన్నికలు ఢంకా బజాయించి నిరూపించాయి.

అణుఒప్పందంపై 2008లో జరిగిన విశ్వాసపరీక్ష సమయంలో కేంద్రంలోని యూపీయే ప్రభుత్వం ఓటుకు నోటు ఇచ్చిందని వికీలీక్స్ బైటపెట్టిన సాక్ష్యాలపై ఒకవైపు పార్లమెంటులోను, దేశవ్యాప్తంగానూ దుమారం లేపిన సమయంలో మనరాష్ట్రంలో ప్రధాన పార్టీలు, వాటి ప్రజాప్రతినిధులు నిస్సిగ్గుగా డబ్బుకు అమ్మకాలు, కొనుగోళ్లు చేస్తూ ప్రజాస్వామ్యానికి పాతరేశాయి. ప్రజల నిస్తేజం పట్ల, బాధ్యతారాహిత్యం పట్ల, మతిమరుపు పట్ల వారికి ఎంతో విశ్వాసం ఉన్నట్టు కనపడుతుంది. ఏం చేసినా ప్రజలు తమను ఏమీ చేయలేరని, ఒకవేళ వారిలో కొంత ఆలోచన పెరిగినా అది పెద్దమార్పునకు దారితీయకుండా తాయిలాలతో, మద్యంతో వారిని మభ్యపెట్టగలమని ఆ పార్టీల్లో ధీమా కన్పిస్తుంది.

ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో లెక్కలు చూపకుండా పదుల కోట్ల రూపాయలు చేతులు మారాయంటే, కడప, చిత్తూరు వంటి కొన్ని ఎన్నికల్లో గెలుపుపై రూ. 25కోట్లు పందాలు కాశారంటే, అదేదో మసాలా సినిమాలో ఉత్కంఠభరిత సన్నివేశంలా చూస్తుంటే, మన జీవితాలకు సంబంధించిన విషయం కాదు అనుకుంటే చివరకు ప్రజలే తీవ్రంగా నష్టపోవాల్సి ఉంటుంది. ఆ తోడేళ్లు పోట్లాడుకుంటున్నది, మాయలు చేస్తున్నది తనను ఎవరు ఎలా తినాలో అని మాత్రమే అని గొర్రెపిల్ల గుర్తించకపోతే బలైపోవాల్సి వస్తుంది. అందుకే ప్రజలు తమ శక్తిని తెలుసుకుని పార్టీల్ని, ప్రజాప్రతినిధుల్ని కట్టడి చేయటం అవసరం. ఎమ్మెల్సీ ఎన్నికలు, వికీలీక్స్ వంటివి తాజా ఉదాహరణలు మాత్రమే. వికీలీక్స్‌పై మనం కొత్తగా ఆందోళన చెందటంలో అర్థం లేదు. మొగుడు కొట్టినందుకు కాకుండా తోడికోడలు నవ్వినందుకు బాధ కలిగిందన్న చందంగా అమెరికా వాళ్ల ముందు మన పరువు పోయిందన్న బాధతప్ప వికీలీక్స్ బైటపెట్టిన విషయాల్లో మనకు తెలియనివేవీ లేవు. అయితే పరిస్థితి పరాకాష్టకు చేరుకుంటోందని మాత్రం అంగీకరించకతప్పదు. నేతల తీరు ప్రజాస్వామ్యం ఉనికికే ప్రమాదకరంగా మారే దశకు వచ్చేసింది. రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలు కావచ్చు, వికీలీక్స్ కావచ్చు... వ్యవస్థకు ప్రక్షాళనకు ఒక అవకాశంగానే మనం భావించాలి. ప్రత్యామ్నాయ రాజకీయం కోసం, రాజకీయ, ఎన్నికల వ్యవస్థల ప్రక్షాళన కోసం కార్యోన్ముఖులం కావాలి. ♦




## సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మభిక్షం మృతికి లోక్‌సత్తా సంతాపం

నైజాం వ్యతిరేక రైతాంగ సాయుధ పోరాటయోధులు సి.పి.ఐ. నాయకులు పార్లమెంట్ మాజీ సభ్యులు, శాసన సభ మాజీ సభ్యులు శ్రీ బొమ్మగాని ధర్మభిక్షం మృతికి లోక్‌సత్తా పార్టీ తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తుంది. సాధారణ కుటుంబంలో జన్మించి అసాధారణ ప్రజా నాయకుడుగా శ్రీ ధర్మభిక్షం ఎదిగారని నీతికి, నిజాయితీకి నిలువుటద్దంగా నిలిచారని లోక్‌సత్తా పార్టీ తన నివాళులర్పించింది.

ఎన్నికల రణరంగంలో ఐదు రాష్ట్రాలు

# 'ఉచితాల' వరద పారిస్తున్న పార్టీలు

దేశంలో 5 రాష్ట్ర అసెంబ్లీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఏప్రిల్ 13న తమిళనాడు, పాండిచ్చేరి, కేరళలలో ఒక విడతలో ఎన్నికలు పూర్తి చేస్తున్న భారత ఎన్నికల కమీషన్ అస్సాంలో మొత్తం ఏప్రిల్ 4, 11 తేదీలలో రెండు విడతల ఎన్నికలు నిర్వహిస్తున్నది. అస్సాంలో రెండువిడతల ఎన్నికలని మనం అర్థం చేసుకోవచ్చు కాని పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 18న ప్రారంభించి, ఏప్రిల్23, ఏప్రిల్27, మే3, మే7, మే10 తేదీలలో 6 విడతలుగా ఎన్నికలు నిర్వహించడం పూర్తిగా అర్థరహితంగా కనిపిస్తున్నది. అక్కడ శాంతి భద్రతల పరిస్థితి సజావుగా లేదన్నా ఆరోపణలు వాస్తవమే అయినా ఒక రాష్ట్రంలో ఇన్ని విడతలుగా విభజించడం ఎన్నికల కమీషన్ అసమర్థతను సూచిస్తున్నదే తప్ప మరొకటిలేదు. ఎన్నికలకు అవసరమైన పోలీసు బలగాలను సమీకరించుకోడానికి అవకాశం వున్నప్పటికీ ఇలా సాగదియ్యడం సముచితంగా లేదు. అందువల్ల ముందుగా ఎన్నికలు పూర్తి చేసుకున్న మిగిలిన 5 రాష్ట్రాలకు ఓట్ల లెక్కింపు సరిగ్గా నెల రోజుల పాటు వాయిదా పడడం సమర్థనీయం కాదు.

ఇకపోతే ఎన్నికలు జరుగుతున్న 5 రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ అస్సాం, కేరళలలో ప్రధాన శక్తిగా వున్నప్పటికీ బి.జె.పి ఈ రాష్ట్రాలలో పెద్దగా పట్టులేదు. పశ్చిమ బెంగాల్‌లో సి.పియం. ఫ్రంటుకీ, తృణమూల్ కాంగ్రెస్ ఫ్రంటుకీ మధ్య ప్రధాన పోటీ వుండగా తమిళనాడులో డి.యం.కె. అన్నాడి.యం.కెల మధ్య ప్రధానంగా పోటీసాగుతున్నది. పాండిచ్చేరి దానికి అనుబంధంగానే వుంటుంది.

**ఈ రాష్ట్రాలలో జరుగుతున్న ఎన్నికలలో వివిధ పక్షాల ధోరణులను సంక్షిప్తంగా పరిశీలించుకుందాం.**

### తమిళనాడులో క్షీణ రాజకీయం

ఏప్రిల్ 13న ఎన్నికలు జరుగనున్న తమిళనాడులో ప్రధానంగా డి.యం.కె. అన్నాడి.యం.కె. కూటమిలు తలబడుతున్నాయి. 234 శాసన సభా స్థానాలలో 4,59,50,620 మంది ఓటర్లు తీర్పు చెప్పబోతున్నారు. ఈ ఓటర్లను ఆకట్టుకోడానికి రెండుకూటములు వాగ్దానాల వరద పారిస్తున్నాయి.గ్రైండర్లు, మిక్సీలు, లాప్‌టాప్‌లు, ఉచిత బస్సు పాసులు, కేజీల కొద్దీ ఉచిత బియ్యం, మంచినీళ్ల క్యాన్లు, కేబుల్ కనెక్షన్లు, తాలిబొట్టు ఇలా ఇంటిల్లిపాదికీ తలా ఒక



వస్తువునీ ఒకరి తర్వాత ఒకరు వాగ్దానాలు కురిపిస్తున్నారు. గతంలో ఒక పార్టీ ఇస్తామన్నది మరొకరు వాగ్దానం చేసేవారు కాదు. ఇప్పుడు ఇద్దరూ వాటినే వాగ్దానం చేస్తూ అదనంగా ఒకటీ అరా కొసరు వేస్తున్నారు. స్వంత డబ్బులతో ఓట్లు కొనడం, మద్యం పొయ్యడంతో ప్రారంభించి "ఉచితాల" పంపిణీకి గతంలోనే శ్రీకారం చుట్టినా ఇప్పుడు మరీ బరితెగించి చేస్తున్నారు. మంది డబ్బుతో జనం ఓట్లు కొనుగోలు చెయ్యడంలో ఇది పరాకాష్ట **ప్రజల మానసిక బలహీనతల ఆధారంగా క్షుద్రకళలు పుట్టిపెరిగితే ఇప్పుడు తమిళనాడులో ప్రజల పేదరికాన్ని, అసహాయతను ఆధారం చేసుకుని ఈ రాజకీయ క్షుద్ర కళను పెంపొందిస్తున్నారు. రాజకీయాన్ని కేవలం అధికార క్రీడగా మార్చిన దాని ఫలితం ఇది.** ఈ అధికార క్రీడ నుండి పుట్టుకొచ్చిన ఓటు మాంత్రికుల క్షుద్ర కళనుండి దేశాన్ని, ఆ రాష్ట్రాన్ని రక్షించడం అవసరం. ప్రజాస్వామ్య వాదులంతా గళం విప్పాలి. ఇలాంటి అనుచిత "ఉచితాల" పై యుద్ధాన్ని ప్రకటించాలి. ఇలాంటి క్షుద్ర రాజకీయ మాంత్రికుల చెరనుండి ప్రజాస్వామ్యాన్ని, ఎన్నికల వ్యవస్థను తప్పించాలి.

**పశ్చిమ బెంగాల్‌లో మార్క్సిస్టుల స్వయం కృతాపరాధం.**

మార్క్సిస్టు పార్టీకి గత 35 సంవత్సరాలుగా బెంగాల్ ప్రజలు పట్టంగట్టారు. తిరుగులేని అధికారాన్ని, అవకాశాన్ని వారికి ఇచ్చారు. ఏప్రిల్ 18 నుండి మే 10 వరకు 6 విడతలుగా జరుగనున్న ఎన్నికలలో 294 అసెంబ్లీ స్థానాలలో 5,60,91,973 మంది ఓటర్లు తాజా తీర్పు ఇవ్వనున్నారు. వామపక్ష కూటమికి ఈ సారి పరాజయం తప్పదని రాజకీయ విశ్లేషకులు ఊహిస్తున్నారు. ఎన్నికల ఫలితాలు ఎలా వున్నా మార్క్సిస్టు కూటమికి గతంలోలాగా నల్లేరు మీద బండి మాత్రం కాదు. ఇదంతా మార్క్సిస్టు కూటమి చేసుకున్న స్వయం కృతారాధంగానే కనిపిస్తుంది. ప్రజలు మూడు దశాబ్దాలకు పై బడి ఇచ్చిన అధికారాన్ని వారు సద్వినియోగం చేసుకోలేక పోయారు. 1940ల నాటి భూసంస్కరణలు తప్ప నేటికీ మరో కొత్తదారి దొరకినట్లు కనిపించదు. కనీసం మోడీలు, నీతీష్ కుమార్‌లు చేస్తున్నపాటి చొరవలు కూడా వారు చూపలేక పోయారు. **ట్రేడ్ యూనియన్లకు బందీలై పారిశ్రామిక ప్రగతికి దూరం అయ్యారు. ప్రభుత్వ టీచర్ల సంఘాలకీ, డాక్టర్ల సంఘాలకీ నాయకులై విద్యనీ, ఆరోగ్యాన్ని విస్మరించారు. ఫలితంగా దేశానికి దారి చూపించాల్సిన వాళ్లు పూర్తిగా దారి తప్పారు. బెంగాల్ వైపు రాష్ట్రాలు, దేశం చూడాల్సింది పోయి దేశంవైపు బెంగాల్ చూసే పరిస్థితి ఏర్పడింది.** మొత్తం మీద ఎదుగు బొదుగు లేని యధాస్థితిమీద వచ్చిన వ్యతిరేకతని మమతాబెనర్జీ తన స్వంతం చేసుకున్నారు. ఆమె దగ్గర ప్రత్యామ్నాయ రాజకీయ విధానాలు



లేవు. కాని యథాస్థితిని మార్చే శక్తిగా ఆమె ప్రజల ముందుకు వచ్చింది. ఆమె బలం మార్క్సిస్టు కూటమి బలహీనత – కొత్త పుంతలు తొక్కడం చేతగాని సి.పి.ఎం. బలహీనత – దానికి ఈ ఎన్నికలలో సి.పి.ఎం. మూల్యం చెల్లించక తప్పనిస్థితి తెచ్చుకుంది.

**కేరళ సి.పి.ఎం. లో కీచులాటలు**

కేరళలో ప్రభుత్వాలు బెంగాల్‌లోలాగ స్థిరంగా వుండడం లేదు. ఒక చిన్న అంశం, సంఘటనతో ఒక శాతం ఓటు అటు ఇటు అయితే ప్రభుత్వాలు మారిపోతున్నాయి. ఇప్పుడు తిరిగి వామపక్ష ప్రభుత్వం అధికారంలోకి రావడం అంత తేలికగా కనిపించడంలేదు. సి.పి.ఎంలో కీచులాటలు గత ఒకటి రెండు సంవత్సరాలుగా ముఖ్యమంత్రి అచ్యుతానందన్‌కి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి విజయన్ మధ్య ప్రచ్ఛన్నయుద్ధం,

## ఉచితాల 'జయ' కేతనం

- ఇంజినీరింగు వరకూ ఎందుకు, ప్లస్‌టూ విద్యార్థులకే ఉచితంగా ల్యాప్‌టాప్‌లు.
- కేబుల్ టీవీ ప్రభుత్వమే నిర్వహిస్తుంది. ప్రజలకు ఉచితంగా కేబుల్ ప్రసారాలు
- అందరికీ గ్రైండర్, మిక్సీ, ఫ్యాను అన్నీ ఇస్తాం
- గర్భిణిలకు ప్రసూతి ఖర్చులు రూ. 12 వేలు
- మహిళా ఉద్యోగినులకు ఆర్నెల్ల ప్రసూతి సెలవు
- కేజీ బియ్యం రూపాయి కూడా లేదు... ప్రతి కార్డుకూ ఉచితంగానే 20 కేజీల బియ్యం.
- పేద విద్యార్థులకు నాలుగు జతల యూనిఫారం
- 58 ఏళ్లకు పైబడిన వయోవృద్ధులు రాష్ట్రమంతటా బస్సుల్లో తిరగడానికి ఉచిత బస్‌పాసు
- దారిద్ర్యారేఖకు దిగువన ఉన్న పేదలకు రోజుకు 20 లీటర్ల మినరల్ నీళ్లు ఉచితం
- పదో తరగతి నుంచి ప్రతి విద్యార్థికి రూ. వెయ్యి నుంచి రూ. 5 వేల వరకు ఉపకార వేతనం
- పెళ్లి చేసుకోబోతున్న పేదింటి యువతులకు అరతులం బంగారంతో మంగళసూత్రాలు
- అన్ని గ్రామాలు, పట్టణాలకు మూడు ఫేజుల విద్యుద్దీకరణ.

## బెంగాల్ బరిలో బంధుగణం

<u>కుమారులు :</u> **అమిత్ మిత్రా** టిఎంసి (తండ్రి మాజీ డిప్యూటీ స్పీకర్)
**సభ్‌రంగ్షు** టిఎంసి (తండ్రి ముఖుల్ రాయ్, మంత్రి)
**అభీర్ బిశ్వాస్** టిఎంసి (తండ్రి ఆనంద మోహన్ బిశ్వాస్, మాజీ మంత్రి)
**దేబేందు అధికారి** టిఎంసి (తండ్రి సిసిర్ అధికారి మంత్రి)
**అభిజిత్ ముఖర్జీ** కాంగ్రెస్ (ప్రణబ్ ముఖర్జీ, కేంద్రమంత్రి)
**సౌమిక్ హుస్సేన్** కాంగ్రెస్ (తండ్రి మన్నన్ హుస్సేన్ ఎంపీ)
**ఇషా ఖాన్ చౌదరి** కాంగ్రెస్ (తండ్రి అబుహషీమ్ ఖాన్ చైదరి ఎంపీ)
**షాద్ హలీమ్** లెఫ్ట్ ఫ్రంట్ (తండ్రి హషీమ్ అబ్దుల్లా హలీమ్ స్పీకర్)
**మొయినుద్దీన్ షామ్స్** లెఫ్ట్ ఫ్రంట్ (తండ్రి కలీముద్దీన్ షామ్స్ మాజీ మంత్రి)
**ఉదయన్ గుహ** లెఫ్ట్ ఫ్రంట్ (తండ్రి కమల్ గుహ మాజీ మంత్రి)
**ఇమ్రాన్ అలీ రామ్జ్** లెఫ్ట్ ఫ్రంట్ (తండ్రి రంజాన్ అలీ మాజీ ఎమ్మెల్యే)
**పలాస్ దాస్** లెఫ్ట్ ఫ్రంట్ (తండ్రి దేబేంద్ర కుమార్ దాస్ ప్రముఖ నాయకుడు)

<u>తమ్ముళ్లు :</u> **ఇఖ్బాల్ అహ్మద్** టిఎంసి (సుల్తాన్ అహ్మద్ మంత్రి)
<u>మేనకోడలు :</u> **సత్‌రూపా** బీజేపీ (స్వపన్ సుదేన్ బోస్ ఎంపీ)

<u>భార్యలు :</u> **నీలిమా నాగ్** టిఎంసి (భర్త సమీర్ నాగ్ మాజీ నాడియా నాయకుడు)
**స్మితా బక్షి** టిఎంసి (సంజయ్ బక్షి మాజీ ఎమ్మెల్యే)
**స్వాతి కందేక్కర్** టిఎంసి (భర్త అక్బర్ కందేక్కర్ మాజీ ఎంపీ)
**మంజు బోస్** టిఎంసి (భర్త, భిక్షాబోస్ టిఎంసి నాయకుడు)
**తమిలికా సేత్** లెఫ్ట్ ఫ్రంట్ (లక్ష్మణ్ సేత్, మాజీ ఎంపీ)

<u>భర్త :</u> **సుదర్శన్ ఘోష్ దస్తేదార్** టిఎంసి (కాకోలి ఘోష్ దస్తేదార్, ఎంపీ)

<u>కోడలు :</u> **షాషి పంజా** టిఎంసి (అజిత్ పంజా మాజీ మంత్రి)

<u>అత్త :</u> **కస్తూరి దాస్** టిఎంసి (సోవన్ ఛటర్జీ, మేయర్)

## వరాల కరుణానిధి

- బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకే కాదు... వృత్తి విద్యాకోర్సుల్లో చేరే విద్యార్థులందరూ... ల్యాప్‌టాప్‌లు.
- ప్రతి ఇంటికీ ఉచితంగా కలర్ టీవీ.
- ప్రతి గృహిణికీ గ్రైండర్ లేదా మిక్సీ
- గర్భిణిలకు ప్రసూతి ఖర్చులు రూ. 10 వేలు
- మహిళా ఉద్యోగినులకు అర్నెల్ల ప్రసూతి సెలవు
- రూపాయికే కేజీ బియ్యం
- నిరుపేదలకు నెలకు 30 కేజీల బియ్యం
- పేద విద్యార్థులకు మూడు జతల యూనిఫారం
- 60 ఏళ్ల వృద్ధులకు ఉచితంగా బస్ పాస్ అన్నాం గానీ దాన్ని 58 నుంచే అమలు చేస్తాం

ప్రత్యక్ష యుద్ధం దాకా ముదిరింది. గతంలోనే అచ్యుతానందనను సి.పి.యం పోలిట్‌బ్యూరో అభిశంసించింది. ఈ ఎన్నికల్లో తొలుత ఆయనకి సీటుకూడా నిరాకరించారు. తర్వాత పార్టీలో, ప్రజలలో రేగిన కలకలంతో ఆయన పోటీకి అనుమతించారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా జరగాల్సిన నష్టం ముందే జరిగిపోయింది. వామపక్ష కూటమికి ఈ ఎన్నికలు గడ్డుగానే వుండే అవకాశాలే హెచ్చుగా వున్నాయి.

**అస్సాంలో పోవని పొత్తులు**

అస్సాంలో 126 స్థానాలలో 1,81,45,914 మంది ఓటర్లు తీర్పు చెప్పనున్నారు. అస్సాంలో కాంగ్రెస్‌ను ఓడించడానికి విశాలమైన పొత్తుల కోసం అస్సాం గణ పరిషత్ చేస్తున్న ప్రయత్నాలు కొలిక్కి రాలేదు. తొలిదశ నామినేషన్ల ఘట్టం ముగిసింది. ఒక పక్క బి.జె.పి ఇప్పటికే 126 స్థానాలలో 116 స్థానాలకి అభ్యర్థుల్ని ప్రకటించింది. దీంతో ఎ.జి.పితో పొత్తు లేనట్లే కనిపిస్తున్నది. ఇక ఎ.జి.పి వామపక్షాలతో స్థానిక అస్సాం పార్టీతో పొత్తు పెట్టుకునే అవకాశాలున్నాయి. అస్సాంలో బంగ్లాదేశ్ నిర్వాసితుల సమస్య ఒకప్పుడు కీలకంగావున్నా ఇప్పుడు బి.జె.పి. తప్ప దానిని ఎవరూ తలనెత్తుకోలేదు. మిగిలిన పార్టీల ఎన్నికల మేనిఫెస్టోల అభివృద్ధి – శాంతి చుట్టూనే వున్నాయి. ♦

## అస్సాం ఎన్నికల్లో క్రిమినల్స్

అస్సాంలో ఏప్రిల్ 4, ఏప్రిల్ 11 తేదీలలో రెండు విడతలు పోలింగ్ జరుగనుంది. మొత్తం 126 స్థానాలలో తొలివిడత జరిగే సగం స్థానాలకు మొత్తం 331 మంది పోటీకి దిగారు. ఇందులో 36 మంది అభ్యర్థుల మీద రకరకాల క్రిమినల్ కేసులు వున్నాయి. పోటీ చేస్తున్న అభ్యర్థులలో 11 శాతం మంది క్రిమినల్ రికార్డుతో వున్నారు.

ఈ 36 మందిలో 14 మంది హత్య, హత్యాప్రయత్నం కేసులలో నిందితులుగా వున్నారు. పార్టీల వారిగా క్రిమినల్ కేసులు వున్న వారి వివరాలు ఇలా వున్నాయి.

ఆలిండియా యూనైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంటు నిలిపిన 29 మంది సభ్యులలో 17 శాతం మంది, అసోంగణ పరిషత్ నిలబెట్టిన 57 మంది అభ్యర్థులలో 14 శాతం మంది, కాంగ్రెస్ నిలబెట్టిన 62 మందిలో 10 శాతం మంది, అలాగే సమ ఉజ్జీగా బి.జె.పి. నిలబెట్టిన 62 మందిలో 10 శాతం మంది క్రిమినల్ కేసులో నిందితులుగా వున్నారు.

అభ్యర్థులు సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగా అసోం ఎలక్షన్ వాచ్ సంస్థ ఈ పరిశీలన చేసిందని ఆ సంస్థ రాష్ట్ర కో ఆర్డినేటర్ టి.ఎ.హుస్సేన్ తెలియజేశారు.

## ఐదేళ్లలో 780 రెట్లు పెరిగిన మంత్రి ఆదాయం

తమిళనాడు ఆహారమంత్రి ఇ.వి. వేలు తిరువణ్ణామలై నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. 2006లో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తన ఆస్తులు రూ.లక్ష రూపాయలని ఆయన తెలిపారు. పింజూరు గ్రామంలో తనకు 1.1 ఎకరా భూమి ఉందని దాని విలువ రూ. 60.000 అని ఆయన ప్రకటించారు. ఐదేళ్ల క్రితం తన క్యాష్ డిపాజిట్‌లు రూ.25,000 అని బంగారం విలువ రూ. 15,000 అని ప్రకటించారు.

60 ఏళ్ల ఈ మంత్రి ఆయన భార్య కలసి తమ ఆస్తుల విలువ రూ. 7.8 కోట్లుగా చూపించారు. బ్యాంకు డిపాజిట్లు రూ.17.47 లక్షలు, వ్యవసాయ భూమి రూ.1.75 కోట్లు, భవనాలు రూ.1.25 కోట్లు, ఇంటి విలువ రూ. 4.5 కోట్లుగా చూపించారు. దాంతోపాటు భార్య వద్ద ఉన్న బంగారం విలువ రూ. 5.76 లక్షలుగా చూపించారు.

## తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో 36 స్థానాల్లో లోక్‌సత్తా పార్టీ పోటీ

**ఏప్రిల్ 13న జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలలో లోక్‌సత్తా పార్టీ మక్కల్ శక్తి కచ్చి పేరుతో 36 స్థానాల్లో పోటీ చేస్తుంది. అభ్యర్థులందరికీ 'ఈల' గుర్తును కేటాయించారు.**

**లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఇటీవల చెన్నైలో లోక్‌సత్తా పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థుల పరిచయ కార్యక్రమంలో పాల్గొన్నారు.**

**లోక్‌సత్తా పార్టీ అభ్యర్థులు అన్ని నియోజక వర్గాల్లోను, రాజకీయాల అవినీతి మీద ప్రజాకర్షణ, ప్రలోభ రాజకీయాల మీద పెద్ద ఎత్తున ప్రచారాన్ని సాగిస్తున్నారు. కొత్త రాజకీయాన్ని ఆహ్వానించాల్సింది గా విజ్ఞప్తిచేస్తున్నారు.**

# ఆదాయపన్నులో అగ్రస్థానంలో ఆంధ్రప్రదేశ్!

రాష్ట్రంలో ఆదాయ పన్ను చెల్లించే వారి రాబడి భారీగా పెరుగుతోంది. అంతేకాకుండా కొత్తగా పన్ను చెల్లించేవారి జాబితాలోనూ పలువురు చేరుతున్నారు. దీంతో ఆదాయపు పన్ను రాబడి ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతోంది. 2005-06లో రాష్ట్రంలో ఆదాయ పన్ను వసూళ్లు రూ॥6,683 కోట్లే ఉండగా ప్రస్తుత 2010-11లో అది ఏకంగా రూ॥19.756 కోట్లకు ఎగబాకింది. అంటే ఐదేళ్లలో 195 శాతం మేర పన్ను ఆదాయం పెరిగింది. మరోవైపు గత ఏడాది రూ॥15.86 లక్షల రిటర్నులు ఆదాయపు పన్నుశాఖకు అందాయి. అంతకు ముందటి మూడేళ్లతో పోలిస్తే ఇవి 1.31 లక్షలు ఎక్కువ.

**అవీ... ఇవీ...**

**చిన్న చెల్లింపుదారులకు ఊరట**

రాష్ట్రంలో ఆదాయ పన్ను వసూళ్లు భారీగా పెరిగిన నేపథ్యంలో ఆ శాఖ కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. రూ॥10లక్షల లోపు ఆదాయం వచ్చే వారికి చీటికీ మాటికీ నోటిసులిచ్చే విధానానికి చరమగీతం పాడాలని నిర్ణయించింది. అధికాదాయ వర్గాల వారిపైనే ప్రధానంగా దృష్టిసారించాలని భావిస్తోంది.

ఈ నేపథ్యంలో ఇక రూ॥10 లక్షలలోపు ఆదాయం గల వ్యక్తులపైనా, 60 ఏళ్లు దాటిన సీనియర్ సిటిజన్లపైనా కచ్చితమైన సమాచారం వచ్చినప్పుడే రిటర్నులను పరిశీలించాలని నిర్ణయించింది. ఇందుకోసం ఇటీవల కేంద్ర ప్రత్యక్ష పన్నుల మండలి ఉత్తర్వులు జారీ చేసింది.

# లోక్‌సభలో వస్తు సేవా పన్ను బిల్లు

ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీ కీలకమైన వస్తుసేవా పన్ను(జీఎస్‌టీ) రాజ్యాంగ సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. పార్లమెంటు 2/3 మెజారిటీతో, 14 రాష్టాలు సాధారణ మెజారిటీతో ఆమోదిస్తేనే ఈ బిల్లు చట్టం అవుతుంది. కొన్ని రకాల పన్నులపై తమ గుత్తాధిపత్యం పోతుందని బిల్లును పలు రాష్ట్రాలు (ముఖ్యంగా భాజపా పాలిత రాష్ట్రాలు) తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. రాష్ట్రాల అభ్యంతరాల మేరకు మూడు సార్లు బిల్లు ముసాయిదాను సవరించి లోక్‌సభలో పెట్టారు. దీన్ని పార్లమెంటరీ స్థాయి సంఘం పరిశీలనకు పంపించే అవకాశం ఉంది. జీఎస్‌టీ వల్ల నిర్వహణ వ్యయాలు తగ్గిపోతాయి. ప్రభుత్వ ఆదాయమూ పెరుగుతుంది.

**బిల్లులో ముఖ్యాంశాలు**

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న పలు పరోక్ష పన్నుల స్థానంలో ఏకీకృత జీఎస్‌టీ వస్తుంది.
- పన్నుమీద పన్ను పరిస్థితిని తొలగించడం దీని లక్ష్యం.
- వస్తు, సేవలకు జాతీయ మార్కెట్‌ను కల్పిస్తారు.
- ముడిచమురు, డీజిల్, పెట్రోల్, విమాన ఇంధనం, సహజవాయువు మద్యంలను జీఎస్‌టీ పరిధి నుండి తొలగించారు.
- కేంద్రం విధించే ఎక్సైజ్ పన్ను, సేవాపన్ను, రాష్ట్రం విధించే వ్యాట్, స్థానిక సంస్థలు విధించే ఇతర పన్నులన్నీ జీఎస్‌టీలో కలిసిపోతాయి.
- కేంద్ర ఆర్థిక మంత్రి నేతృత్వంలో జీఎస్‌టీ మండలి ఏర్పడుతుంది. పన్ను రేట్లను, రాయితీలను, గరిష్ట పరిమితులను ఈ మండలే నిర్ణయిస్తుంది.
- రెవెన్యూ వ్యవహారాలు చూసే కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రి, ప్రతీ రాష్ట్రం నుంచి ఆర్థిక మంత్రి లేదా పన్నుల శాఖలు చూసే మంత్రి సభ్యులుగా ఉంటారు.
- ప్రతి నిర్ణయం హాజరైన సభ్యుల్లో అత్యధికుల సమ్మతి ద్వారా తీసుకుంటారు.
- జీఎస్‌టీ వివాదాల పరిష్కార సాధికార సంస్థను ఏర్పాటు చేస్తారు. దానికి ఛైర్మన్, ఇద్దరు సభ్యులు ఉంటారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన వారు ఛైర్మన్ పదవికి అర్హులు న్యాయశాస్త్రం, ఆర్థిక శాస్త్రం, ప్రజా సంబంధ అంశాల్లో లబ్ద ప్రతిష్ఠులు సభ్యులుగా ఉంటారు.

## చట్టాలు చేసే పని న్యాయమూర్తులది కాదు

న్యాయమూర్తులు చట్టాలు చేసే పనికి పూనుకోరాదని, అది ప్రజాస్వామ్య మూల సూత్రాల ఉల్లంఘనే అవుతుందని తెలిపింది. సమానత్వం పేరుతో న్యాయస్థానాలు నిబంధనలకు కొత్త భాష్యాలు చెప్పరాదని జస్టిస్ మార్కండేయ కట్జూ, జస్టిస్ జ్ఞానసుధా మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. "సాధారణ నిబంధనకు ఒకసారి దూరం జరిగామంటే... చట్టబద్ధ ఏర్పాటుకు ఎన్ని వ్యాఖ్యానాలైనా చెప్పొచ్చు. అప్పుడు ప్రతీ న్యాయమూర్తి తనకు ఇష్టం వచ్చిన వ్యాఖ్యానాలతో ఆడుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది" అని ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రజాస్వామ్య మూల సూత్రాల ప్రకారం చట్టాలు చేయడం ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధుల పనే కాని న్యాయమూర్తులది కాదని తేల్చిచెప్పింది. నిబంధన సాధారణ వ్యాఖ్యానం కఠినంగా, అసౌకర్యంగా ఉన్నా దాన్ని అనుసరించాల్సిందేనని ప్రకటించింది. 2006 మే 23న కేరళ హైకోర్టు విస్తృత ధర్మాసనం ఇచ్చిన ఒక తీర్పును సుప్రీంకోర్టు తోసిపుచ్చుతూ ఈ అంశాలను ప్రస్తావించింది.

## 610 జీవో అమలుపై పర్యవేక్షక సంస్థ

తెలంగాణా ఉద్యోగ సంఘాల ఐకాసతో కుదిరిన ఒప్పందంలో భాగంగా 610 జీవో అమలు కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా ఉన్నత స్థాయి పర్యవేక్షక ప్రాధికార సంస్థను (మానిటరింగ్ అథారిటీ) ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ సోమవారం ఉత్తర్వులు (జీవో నెం.146) జారీ చేసింది. ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల్లో ఉద్దేశపూర్వకంగా రాష్ట్రపతి ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై క్రమశిక్షణ చర్యల కోసం మరో ఉత్తర్వు (జీవో నెం.147) నిచ్చింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా ఉండే ఈ సంస్థలో ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి న్యాయశాఖ కార్యదర్శి, సాధారణ పరిపాలనాశాఖ కార్యదర్శి, ప్రభుత్వ శాఖల ముఖ్య కార్యదర్శులు సభ్యులుగా ఉంటారు. ఈ సంస్థ రెండు నెలలకోసారి సమావేశమై 610 జీవో అమలును సమీక్షించి, శాఖల మధ్య సమన్వయం సాధిస్తుందని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. గుర్తింపు పొందిన సంఘాల ప్రతినిధులను ఈ సమావేశానికి ఆహ్వానిస్తారని వెల్లడించింది.

## యడ్యూరప్పపై విచారణకు లోకాయుక్త ఆదేశం

ముఖ్యమంత్రి యడ్యూరప్పపై దాఖలైన భూ కుంభకోణం, అవినీతి ఆరోపణల కేసు గురించి విచారణ జరిపి మే నాలుగో తేదీలోగా నివేదిక సమర్పించాలని లోకాయుక్త ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జస్టిస్ హిప్పర్గి పోలీసుల్ని గురువారం ఆదేశించారు. యడ్యూరప్ప, ఆయన కుటుంబంపై బాలరాజు, సిరాజిన్ భాషా అనే ఇద్దరు న్యాయవాదులు గవర్నరు అనుమతితో మొత్తం ఐదు కేసులు దాఖలు చేసిన భూముల డీ నోటిఫికేషన్ల ద్వారా యడ్యూరప్ప, ఆయన అల్లుడు సోహన్‌కుమార్, ఇతర కుటుంబ సభ్యులు ఆర్థికంగా, ఆస్తులపరంగా లబ్ధి పొందినట్లు వాజ్యాల్లో ఫిర్యాదుదార్లు ఆరోపించారు. విచారణకు కొంతకాలం పాటువాయిదా వేయాలని ముఖ్యమంత్రి అల్లుడు సోహన్‌కుమార్ ఇటీవల వేసిన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది.

## ఢిల్లీ విమానాశ్రమంలో భారీ నగదుతో పట్టుబడ్డ తృణమూల్ ఎం.పి.

తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎం.పి కన్వర్ దీప్ సింగ్ శుక్రవారం రూ॥57 లక్షల నగదుతో న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో పట్టుబడ్డారు. జార్ఖండ్ రాష్ట్రం నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న కన్వర్‌దీప్ సింగ్ మరో ఏడుగురు వ్యక్తులతో శుక్రవారం ఉదయం ప్రయివేట్ విమానంలో బయలుదేరి వెళ్లడానికి వచ్చినప్పుడు సిఐఎస్ఎఫ్ జవాన్లు విమానాశ్రయం వద్ద తనిఖీ చేస్తుండగా ఈ డబ్బు బయట పడింది. వెంటనే ఈ విషయమై సిఐఎస్ఎప్ జవాన్లు ఐటి (విమానయాన విభాగం) అధికారులకు సమాచారం అంద చేశారు. ఐటి అధికారుల విచారణలో ఈ నగదు తన వ్యక్తిగతం కాదని, కంపెనీకి చెందినదని కన్వర్‌దీప్ సింగ్ పేర్కొనడంతో తర్వాత వదిలేశారని సమాచారం. ఆల్ కెమిస్ట్ గ్రూప్ యజమాని అయిన కన్వర్‌దీప్‌సింగ్ తాను గౌహతి వెళుతున్నానని చెప్పారు. ఐదు రాష్ట్రాల శాసనసభలకు వచ్చేనెలలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో భారీ మొత్తంలో నగదు తీసుకెళుతూ తృణమూల్ ఎంపి పట్టుబడడం గమనార్హం.

# హాంకాంగ్‌లో అవినీతికి కళ్ళెం

■ **అవినీతి వ్యతిరేక స్వతంత్ర కమిషన్ (ICAC) సాధించిన విజయాలు**

**డి. సోమసుందర్**

అవినీతి నిర్మూలనలో హాంకాంగ్ ది ఒక విజయగాథ. అసాధ్యమని అందరూ పెదవి విరిచినా అవినీతి అంతాన్ని అక్కడి ప్రజలు సుసాధ్యం చేసారు. అవినీతి గురించిన ప్రజల దృక్పథం మారింది. ప్రభుత్వాలూ, ప్రజలూ కలిసి హాంకాంగ్‌ను అవినీతి రహితదేశంగా మార్చేందుకు కృషి చేస్తున్నారు. మూడున్నర దశాబ్దాలలో హాంకాంగ్ స్వరూపమే మారిపోయింది.

హాంకాంగ్ ఒకప్పుడు బ్రిటీష్ కాలనీగా వుండేది. అప్పట్లో ప్రపంచంలోని అత్యంత అవినీతికరమైన నగరంగా పేరు సంపాదించింది. పుట్టిన దగ్గర్నుంచీ చనిపోయేవరకూ అవినీతి ఒక జీవితవిధానంగా అక్కడిప్రజలు ఆమోదించేసారు చట్టాన్ని అమలు చేసే ప్రభుత్వ విభాగాలకూ, నేరస్థ ముఠాలకూ మధ్య వ్యాపార సంబంధాలు నడుస్తుండేవి. ప్రభుత్వ సంస్థలే అన్ని రకాల నేరాలను ప్రోత్సహిస్తూ వుండేవి. నేరాలు, జూదాలు, వ్యసనాలు, మాదక ద్రవ్యాల సరఫరా, వంటి వాటికి ప్రభుత్వ సంస్థల తోడ్పాటు లభిస్తుండేది. ఇదెంత బహిరంగం గా వుంటుందో ఒక ఉదాహరణ చెపితే అర్థమవుతుంది. నెలవారీ చీటీ ఒకదాన్ని కొనుక్కుని టాక్సీపై అంటించుకుంటే ట్రాఫిక్ నేరాలు ఎన్ని చేసినా పోలీసులు పట్టించుకోరన్నమాట బహిరంగ అవినీతి స్థాయి ఎంతగా వుండేదో దీన్ని బట్టి వూహించవచ్చు.




సరిగ్గా అటువంటి రోజుల్లో 1974లో హాంకాంగ్‌లో "అవినీతి వ్యతిరేక స్వతంత్ర కమిషన్ (ఐసీఏసీ) ఏర్పడింది. ఈ కమిషన్ అవినీతిని అంతం చెయ్యగలదని అప్పట్లో ఒక్కరు కూడా నమ్మలేదు. అవినీతి అంతం అసాధ్యమనేదే ప్రజల సార్వత్రిక అభిప్రాయం. కానీ కమీషన్ ఏర్పడిన మూడేళ్లలోనే ప్రభుత్వంలో భాగంగా వుంటూ వచ్చిన అన్ని రకాల అవినీతి సిండికేట్లనూ ధ్వంసం చేయగలిగింది. 143 మంది పోలీసు అధికారులతో సహా 247 మంది ప్రభుత్వ అధికారులను ప్రాసిక్యూట్ చేసింది. ఐసీఏసీ ఏర్పడిన మూడున్నర దశాబ్దాల తర్వాత ఇప్పుడు హాంకాంగ్ స్వరూపమే మారిపోయింది. అక్కడి సంస్కృతిని మార్చడంలో ఐసీఏసీ కీలకపాత్ర పోషించింది. 2000 సంవత్సరంలో హాంకాంగ్ లో నిర్వహించిన మిలీనియం ప్రజాభిప్రాయ సేకరణలో 150 సంవత్సరాల చరిత్రలో జరిగిన అత్యంత ప్రముఖ ఘటనల జాబితాలో ఐసీఏసీ స్థాపనకు ఆరవస్థానం లభించింది.

ప్రస్తుతం హాంకాంగ్‌లో ప్రభుత్వ సంస్థలలోని అన్ని రకాల బహిరంగ లంచగొండి తనం పూర్తిగా అంతమయ్యింది. ఇప్పుడక్కడ అవినీతి అత్యంత రహస్యంగా జరిగే నేరం మాత్రమే. ఎవరైనా లంచం ఇచ్చినా అది తమకు పనులు జరిగాయన్న సంతృప్తితో ఇష్టపూర్వకంగా ఇచ్చుకునే బహుమానం రూపంలో వుంటున్నది. ప్రైవేటు రంగంలో అవినీతిని అరికట్టడానికి ప్రపంచంలో జరిగిన తొట్టతొలి ప్రయత్నాలలో హాంకాంగ్ పాలు పంచుకున్నది. ప్రైవేటు రంగంలో అవినీతిని అరికట్టడంలో హాంకాంగ్ విజయం సాధించింది. హాంకాంగ్‌లో ఎన్నికలు కూడా స్వచ్ఛంగా, నీతివంతంగా జరుగుతున్నాయి. అవినీతిని ఒక జీవిత

విధానంగా ఆమోదించిన అక్కడి ప్రజల దృక్పథంలో సైతం మార్పు వచ్చింది. వారిప్పుడు అవినీతి వ్యతిరేక పోరాటానికి గట్టి మద్దతు ఇస్తున్నారు. అవినీతి గురించిన ఫిర్యాదులు చెయ్యడానికి, ఫిర్యాదులో తమ పేర్లను ప్రస్తావించడానికి వెనుకాడడం లేదు. హాంకాంగ్ ఈ విషయంలో అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించడంలో క్రియాశీల భాగస్వామిగా వ్యవహరిస్తోంది. 'అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక మహాసభ' స్థాపనలో ఐసీఏసీ సహవ్యవస్థాపకురాలిగా వున్నది.

అవినీతి వ్యతిరేక పోరాటం ఏదో ఒక పరిష్కారంపైనే ఆధారపడి నడపడం సాధ్యం కాదని, దీనికి బహుముఖ వ్యూహం, సాధనాలు అవసరమని హాంకాంగ్ అనుభవం రుజువు చేసింది. హాంకాంగ్‌లో అవినీతి నిర్మూలనకు ఐసీఏసీ త్రిముఖ వ్యూహాన్ని అనుసరించింది. 1. అవినీతి జరుగుతున్నపుడు పట్టుకోవడం 2. అవినీతి జరగకుండా నిరోధించడం 3. ప్రజల్ని చైతన్యవంతుల్ని చెయ్యడం, అనే మూడు రకాల కార్యక్రమాలను చేపట్టింది. అందుకోసం కమీషన్ మూడు విభాగాల్ని ఏర్పాటు చేసింది. 1. ఆపరేషన్స్ విభాగం అవినీతి వ్యవహారాలపై దర్యాప్తు చెయ్యడం దీని బాధ్యత. 2. అవినీతి నిరోధక విభాగం ప్రభుత్వరంగంలోని వ్యవస్థలనూ, పద్ధతులనూ అధ్యయనం చేసి, అవినీతికి అవకాశం ఎక్కడెక్కడ వుంటున్నదో కనిపెట్టి, లోపాలను సవరించడానికి తగిన సూచనలు ఇవ్వడం ఈ విభాగం బాధ్యత 3. ప్రజా సంబంధాల విభాగం. అవినీతికి వ్యతిరేకంగా ప్రజల్ని చైతన్యవంతుల్ని చెయ్యడం, అవినీతి వ్యతిరేకపోరాటంలో ప్రజల మద్దతును కూడగట్టడం, వారిని భాగస్వాముల్ని చెయ్యడం ఈ విభాగం బాధ్యత.




ఐసీఏసీ తన ప్రయత్నంలో 70 శాతం వనరులను ఆపరేషన్స్ విభాగానికే వెచ్చించింది. చట్టాలను కఠినంగా అమలు చెయ్యడం ద్వారానే ఫలితాలు సాధించడం వీలవుతుంది. చట్టాల అమలుతోనే ప్రజల విశ్వాసం పొందడం సాధ్యమవుతుంది. అందువల్లనే ఐసీఏసీ దీనిపై దృష్టి సారించింది. ప్రభుత్వ స్థిర సంకల్పం, అమలు యంత్రాంగం నిబద్ధత చట్టాల అమలులోనే వెల్లడవుతుంది. చట్టాలు కఠినంగా అమలు చేస్తున్నారన్న విశ్వాసం కలిగితేనే ఫిర్యాదులు చెయ్యడానికి ప్రజలు అమలు చేస్తున్నారన్న విశ్వాసం కలిగితేనే ఫిర్యాదులు చెయ్యడానికి ప్రజలు ముందుకు వస్తారు. సమస్యను గుర్తించడానికి, అవినీతి నిరోధంలోని అవరోధాలను గమనించడానికి, చట్టాల అమలు, సమీక్ష వినియోగపడ్డాయి.

ఐసీఏసీ తన ప్రయత్నంలో విజయవంతం కావడానికి నిపుణులైన సిబ్బందిని వినియోగించింది. అవినీతికి పాల్పడేవారు తెలివితోనూ, పరిజ్ఞానంతోనూ వ్యవహరిస్తారు. వాళ్ళ వెనుక బలమైన శక్తులు కూడా వుంటాయి. వీటిని ఎదుర్కోవడానికి వృత్తిపరమైన నిపుణత అవసరం దాంతోపాటు నీతి నిజాయితీ, వృత్తి నిబద్ధత, పోరాటస్ఫూర్తి కలిగివున్నవారు మాత్రమే అవినీతి వ్యతిరేక పోరాటంలో నిలబడగలుగుతారు. దర్యాప్తులో వృత్తిగత నైపుణ్యాన్ని వినియోగించడంలో ఐసీఏసీ ఉత్తమ ప్రమాణాలను పాటించింది. అనుమానితుల విచారణను వీడియో చిత్రీకరణ ప్రారంభించిన ఘనత ఐసీఏసీకే దక్కుతుంది. 120 మంది ప్రత్యేక శిక్షణ పొందిన ఏజంట్లతో నిఘాబృందం అంకితభావంతో పనిచేస్తోంది. సాక్షుల సంరక్షణ, కంప్యూటర్ ఫోరెన్సిక్స్, ఆర్థికనేరాల దర్యాప్తుకోసం ప్రత్యేక విభాగాలు కూడా ఏర్పటయ్యాయి.

నేరనిరోధానికి కొన్ని ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. పటిష్టమైన ఫిర్యాదుల స్వీకరణ వ్యవస్థను ఏర్పాటు చేసింది. 24 గంటలూ పనిచేసే ఫిర్యాదుల స్వీకరణ కేంద్రం వుంది. ప్రజలందరికీ పరిచితమైన నంబరుతో టెలిఫోన్ హాట్‌లైను పనిచేస్తున్నది. ఫిర్యాదులకు తక్షణ స్పందన, తక్షణ చర్యల కోసం నిరంతరం నేరనిరోధక బృందాలు అందుబాటులో వుంటేటట్లు చూస్తారు. సకారణమైన అనుమానం వున్నా, అవినీతిపై ఫిర్యాదులు వచ్చినా, అవి చిన్నవైనా, పెద్దవైనా క్షుణ్ణంగా దర్యాప్తు చేసి తీరాల్సిందే. వృత్తిపరమైన నైపుణ్యంతో, సక్రమంగా దర్యాప్తు

జరిగిందీ లేనిదీ చూసేందుకు సమీక్షా వ్యవస్థ కూడా వున్నది. చట్టాలను కఠినంగా అమలు చేసిన సందర్భాలలో అటువంటి ఉదంతాలకు విస్తృత ప్రాచుర్యం కల్పిస్తారు. మరొకరు అవినీతికి పాల్పడడానికి భయపడేటట్లు మీడియాలో ప్రచారం జరుగుతుంది.

అవినీతి నిరోధంలో భాగంగా ప్రభుత్వశాఖలలో, పబ్లిక్ సంస్థలలో అవినీతి అవకాశాలను తగ్గించేందుకు ఐసీఏసీ ప్రాముఖ్యం ఇచ్చింది. సంస్థగత నియంత్రణలను పెంచింది. సిబ్బందిలో నీతి, నిజాయితీలను పెంపొందించే ప్రయత్నం చేసింది. కార్యపద్ధతులను క్రమబద్ధీకరించి, తగిన పర్యవేక్షణను, తనిఖీ – నియంత్రణా వ్యవస్థలను పటిష్టం చేసింది. పని సామర్థ్యాన్ని, పారదర్శకతనూ, జవాబుదారీతనాన్ని పెంపొందించింది. సిబ్బంది నైతిక ప్రవర్తనా నియమావళిని రూపొందించి అమలు చేసింది.

అవినీతి వ్యతిరేక పోరాటానికి ప్రజల మద్దతును కూడగట్టడానికీ, భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి జన చైతన్యకార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టింది. అవినీతి కేసుల గురించి వార్తలను ప్రాచుర్యంలోకి తేవడం, విజయవంతమైన కేసులను టీవీలలో ఎపిసోడ్‌లుగా ప్రసారం చెయ్యడం, పత్రికాప్రకటనలు, పత్రికాసమావేశాలు, ఇంటర్వ్యూలు వంటివి ఇవ్వడం ఒక కార్యక్రమంగా నిర్వహిస్తూ వచ్చింది. ప్రజలు అవినీతిపై ఫిర్యాదులు చేసేటట్లుగా ప్రోత్సహించడానికీ, అవినీతి వల్ల జరిగే హాని గురించీ, నీతివంతమైన, న్యాయబద్ధమైన సమాజం ఆవశ్యకత గురించీ, ప్రజల్లో చైతన్యం కల్గించే వాణిజ్య ప్రకటనలు రూపొందించి ప్రసారం చేస్తూ వచ్చింది. విద్యార్థులలో అవగాహన పెంపొందించే కార్యక్రమాలు చేపట్టింది. ఇటువంటి అవగాహనా కార్యకలాపాలలో పాల్గొనే స్వచ్ఛంద కార్యకర్తలను నమోదు చెయ్యడానికి ఒక ప్రత్యేక క్లబ్‌ను ఏర్పాటు చేసింది. అధికారులకూ, పారిశ్రామిక, వ్యాపారవర్గాలకు అవినీతి నిరోధంపై ప్రసంగాలు, నైతిక విలువల ఆవశ్యకతపై సెమినార్లు ఏర్పాటు చేసింది. అవినీతి నిరోధంలో పనికొచ్చే ఉత్తమ పద్ధతులనూ, మార్గదర్శకాలనూ రూపొందించింది. స్వచ్ఛమైన సమాజ ఆవశ్యకతను ప్రచారం చేసే ఎగ్జిబిషన్లనూ, ఉత్సవాలనూ, టీవీషోలను ఏర్పాటు చేసింది.

వీటన్నిటికీ తోడు అవినీతి నిరోధానికి అవసరమైన గట్టి చట్టాలను హాంకాంగ్ ప్రభుత్వం తెచ్చింది. లంచగొండితనంతో పాటు, అవినీతి లావాదేవీలతో సంబంధం లేకపోయినా ప్రభుత్వాధికారులు బహుమతులు, రుణాలు, రాయితీలు, తగ్గింపులు తీసుకోవడాన్ని నేరంగా నిర్వచించారు. ఆదాయ వనరులకంటే ఎక్కువ ఆదాయాన్ని కల్గివుండటం, సంపాదన కంటే ఎక్కువ సొమ్మును ఖర్చుచెయ్యడం, విలాసాలు, ఆడంబరాలతో జీవించడం కూడా నేరంగానే పరిగణించారు. సోదా, అరెస్టు, డిటెన్షన్, వంటి మామూలు అధికారాలతోపాటు బ్యాంకు ఖాతాల తనిఖీ ప్రమాణం చేసి సాక్షుల చేత జవాబు చెప్పించడం, అవినీతి సంపాదనతో కొన్న ఆస్తులను స్వాధీనం చేసుకోవడం, అనుమానితుల ప్రయాణ ప్రతాలను స్వాధీనం చేసుకోవడం వంటి అధికారాలను ఐసీఏసీ కల్పించింది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలోని అవినీతిని దర్యాప్తు చెయ్యడంతోపాటు, అవినీతితో ముడిపడిన ఇతర నేరాలను కూడా దర్యాప్తు చేసే అధికారం ఐసీఏసీ కల్పించింది.

అవినీతిని అంతం చెయ్యడంలో హాంకాంగ్‌లో గట్టి రాజకీయ సంకల్పం వుంది. అవినీతి వ్యతిరేక స్వతంత్ర కమిషన్ (ఐసీఏసీ) ను నిజంగానే స్వతంత్ర సంస్థగా పని చెయ్యనివ్వడంలో రాజకీయ నేతలు సహకరించారు. హాంకాంగ్ ముఖ్య కార్యనిర్వాహణాధికారికి జవాబుదారీగా ఐసీఏసీ పనిచేస్తోంది. దాంతో దర్యాప్తు ప్రక్రియలో జోక్యం చేసుకోవడానికి ఎవరికీ అవకాశం చిక్కలేదు. రాజకీయ సంకల్పం ఫలితంగానే ఐసీఏసీకి నిధుల కొరత లేకుండా పోయింది. ప్రపంచంలోని అవినీతి వ్యతిరేక ఏజన్సీలలో ఎక్కువ సొమ్ము ఖర్చు చేస్తున్న సంస్థగా ఐసీఏసీకి ఖ్యాతి లభించింది. అవినీతి నిరోధానికి హాంకాంగ్ చేస్తున్న తలసరి ఖర్చు 15 అమెరికన్ డాలర్లు, ఈ మొత్తం, హాంకాంగ్ జీడీపీలో 0.5 శాతంగానూ, హాంకాంగ్ వార్షిక బడ్జెట్‌లో 0.3 శాతంగానూ వుంది.

హాంకాంగ్ విజయగాథ అన్ని దేశాలకూ అనుసరణీయం. దేశాలు తమ తమ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలను రూపొందించకుంటే ఫలితాలు సాధించడం వీలవుతుంది. అవినీతి అంతం అసాధ్యం అనుకుంటూ నిరుత్సాహంతో కొట్టుమిట్టాడుతున్న సమాజాలకు హాంకాంగ్ అనుభవం ఒక ఆశాదీపం. గట్టి రాజకీయ సంకల్పం, అంకితభావం, నిబద్ధతతో పనిచేసే యంత్రాంగం, సరైన వ్యూహంతో కృషి చేసిన ఫలితంగానే ఒకప్పుడు అవినీతిలో సతమతమైన హాంకాంగ్ నేడు స్వచ్ఛమైన సమాజంగా మార్పు చెందింది. ■

# రైతుల ఆదాయాన్ని పెంచే వ్యూహం లేని కేంద్రబడ్జెట్



**యం.యస్. స్వామినాథన్,** రాజ్యసభ సభ్యులు
జాతీయ వ్యవసాయ కమీషన్ ఛైర్మన్

**వ్యవసాయ రంగం రైతాంగం సమస్యలు**

2011-12 సంవత్సరం కేంద్రబడ్జెట్‌కు ఒక నేపథ్యం వుంది. ప్రస్తుతం ప్రపంచంలో ఆహార సంక్షోభం తలెత్తింది. ఒక పక్క చైనా, తదితర ఆహారధాన్యాలు ప్రధానంగా పండించే దేశాలలో సంభవించిన ప్రకృతి వైపరీత్యాల వల్ల, మరోపక్క మధ్యప్రాచ్యంలో (అరబ్బు దేశాలలో) ప్రజాస్వామ్య ఉద్యమ తాకిడితో పెట్రోలియం ధరలు పెరగడం వల్ల ఈ పరిస్థితి తలెత్తింది. గత బడ్జెట్‌లోనే ప్రణబ్ ముఖర్జీ తూర్పు భారతంలో ఆహారధాన్యాల ఉత్పత్తులను పెంచడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. భారత వ్యవసాయ రంగంలో నిద్రిస్తున్న మహాశక్తిగా జాతీయ వ్యవసాయ కమీషన్ ఈ ప్రాంతాన్ని పేర్కొంది. అలాగే గత బడ్జెట్‌లోనే పప్పుదినుసుల దిగుబడి పెంచడానికి 60,000 గ్రామాలను ఎంపిక చెయ్యడం, మహిళా కిసాన్ సశక్తీకరణ పరియోజన పథకంతోపాటు పరపతి, ఎరువులు సబ్సీడీలు, మౌలిక సదుపాయాల కల్పన వంటి చర్యలు ప్రారంభించారు. దురదృష్టం ఏమిటంటే ఇందులో చాలా కార్యక్రమాలు సక్రమ అమలుకు నోచుకోలేదు. అవి ప్రభావం చూపగల స్థితి రాలేదు.

2011-12 బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి సంబంధించి ఈ కింది అంశాలు ప్రధానంగా వున్నాయి. తూర్పు భారత ప్రాంతానికి హరిత విప్లవాన్ని విస్తరింపజెయ్యడం. వర్షాభావ ప్రాంతాలలోని 60,000 గ్రామాలలో సమీకృత పప్పు దినుసుల పంటల్ని పెంపొందించడం, ఆయిల్‌పాం తోటల్ని విస్తరించడం, పండ్లు, కూరగాయాల ఉత్పత్తులతోపాటు పౌష్టికాహారాన్ని అందించే రాగులు, జొన్నలు, సజ్జలు వంటి తృణ ధాన్యాల ఉత్పత్తుల్ని పెంచడం అలాగే ఎంపిక చేసిన ప్రాంతాలలో పాడిపశువులను, గొర్రెలు, పందులు, చేపల పెంపకాల కోసం ఒక జాతీయ మిషన్‌ను ప్రారంభించడం జరిగింది. అలాగే పశువుల మేతను పెంపొందించడానికి, సేంద్రీయ వ్యవసాయాభివృద్ధికి సత్వరచర్యలకు ఏర్పాట్లు చేశారు. రైతులకు అందించే పరపతిని 4,75000 కోట్లకి పెంచారు. ఇప్పటివరకు పరపతిలో ప్రధాన భాగం కంపెనీలకే దక్కుతున్నది గాని రైతులకి దక్కడం లేదు.

చిన్న, సన్నకారు రైతులకు బ్యాంకులు నేరుగా రుణాలివ్వాలని ప్రణబ్ ముఖర్జీ సూచించారు. అలాగే పంటరుణాలను సకాలంలో చెల్లించేవారికి 4 శాతం వడ్డీపై రుణాలివ్వాలన్న జాతీయ వ్యవసాయ కమీషన్ 2006 సంవత్సరంలో చేసిన సూచనను ఇప్పుడు ఆయన అమలు చేస్తామని ప్రకటించారు. అలాగే మెగా ఆహార పార్కుల ఏర్పాటుకు, గొడవున్ల నిర్మాణానికి, కోల్డ్‌స్టోరేజి చైన్‌ల ఏర్పాటును బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఈ రంగంలో ప్రయివేటు పెట్టుబడులకు వీలు కల్పించారు.

అలాగే ఈ సంవత్సరం పార్లమెంటులో జాతీయ



ఆహారభద్రత చట్టాన్ని తీసుకురానున్నట్టు తన బడ్జెట్ ప్రసంగంలో ప్రణబ్ ముఖర్జీ వెల్లడించారు. మహిళలలో, పిల్లలలో విస్తారంగా వున్న పౌష్టికాహార లోపాన్ని తొలగించడానికి ఇది ఉద్దేశించబడింది. అలాగే ఎరువుల మీద, కిరసనాయిల్ మీద ఇస్తున్న సబ్సిడీలను నేరుగా రైతులకు చెల్లించే పద్ధతిని తీసుకువస్తామని ప్రకటించారు. డ్రిప్ ఇరిగేషన్‌కు సంబంధించిన సామాగ్రి దిగుమతులపై ఎక్సైజ్ డ్యూటీని తగ్గించారు. అలాగే 500 కోట్ల రూపాయలతో మహిళా స్వయం సహాయక సంఘాలకు నిధుని ఏర్పాటు చెయ్యడం ఆహ్వానించదగ్గ పరిణామం. దీనిని మహిళా కిసాన్ పథకానికి అనుసంధానం చేస్తే అది గ్రామీణ ఆదాయాన్ని ప్రభావితం చేస్తుంది.

మొత్తం మీద ఈ బడ్జెట్‌లో ఇలాంటి కొన్ని మంచి ప్రతిపాదనలు వున్నప్పటికీ ఒక దార్శనికదృక్పథం కాని, వ్యూహం కాని లేవు. రైతులని వ్యవసాయంలో స్థిరపర్చడానికి, వ్యవసాయంలోకి యువతని ఆకర్షించడానికి, నిలబడడానికి అవసరమైన యువతరంతో నిండిన మన జనాభా నుంచి ఫలితాలు పొందాల్సిన అవశ్యకతను ఆర్థిక మంత్రి నొక్కి చెప్పినప్పటికీ యువతను వ్యవసాయ రంగానికి ఆకర్షించడానికి తగిన వ్యూహంగాని, కార్యక్రమాలు గానీ ఈ బడ్జెట్‌లో లేవు. వ్యవసాయ పట్టభద్రులలో అత్యధికులు వ్యవస్థీకృతరంగంలో ఉద్యోగాల కోసం వెదుకుతున్నారేగాని గ్రామాలకు తిరిగి వెళ్లడానికి ఆసక్తిని చూపించడం లేదు. 2007లో పార్లమెంటు ముందుంచిన జాతీయ రైతు విధానంలోని రెండు లక్ష్యాలను విస్మరించడం ఈ బడ్జెట్‌లో వున్న ప్రధాన లోపం. ఈ జాతీయ విధానం వ్యవసాయాన్ని లాభసాటిరంగం చెయ్యాలని వ్యవసాయ కుటుంబాల నిజమైన ఆదాయం వ్యవసాయ అభివృద్ధి రేటుకు ప్రాతిపదిక కావాలని సూచించింది. యువరైతులు వ్యవసాయాన్ని ఒక వృత్తిగా స్వీకరించడానికి తగిన సమీకృత ప్రణాళికను రూపొందించాలని భావించింది ఇందులో ఉత్పాదకతను పెంచడం ద్వారా వ్యవసాయేతర కార్యకలాపాల ద్వారా అత్యధిక ఆదాయాన్ని పొందే విధంగా దానిని రూపొందించాలని పేర్కొనబడింది.

దురదృష్టం ఏమిటంటే ప్రపంచ ఆహార సంక్షోభం, ఆహార ద్రవ్యోల్బణం పెరుగుతున్న సంవత్సరంలో వ్యవసాయ రంగంలో ప్రగతినీ, సంపదనీ త్వరితం చేసే అవకాశాన్ని జారవిడుచుకుంటున్నాం. ఇప్పుడు రైతులకి మిగిలిన ఆశ ఒక్కటే – ఆహార భద్రత చట్టం. ఆఫీసులలో ఫైళ్లు ఆధారంగానే సమాచార హక్కు చట్టం అమలు అవుతుంది. అలాగే రైతుల సహాయంతో మాత్రమే ఆహార భద్రతా చట్టం అమలు సాధ్యమౌతుంది. ♦

# సాగు భూమి తగ్గుతోంది

దేశంలో ఆందోళనకర రీతిలో సాగుభూమి తగ్గిపోతోంది. ఐదేళ్ల కాలంలో సుమారు 8 లక్షల హెక్టార్ల (43%) పంట భూమి వ్యవసాయేతర వినియోగానికి మళ్లిపోయింది. ఐదేళ్ల కాలానికి సంబంధించి ప్రభుత్వ లెక్కల ప్రకారం వెల్లడైన ఈ వాస్తవాల వివరాలు ఇలా ఉన్నాయి.

- 2003-04 నాటికి దేశంలో 18 కోట్ల 31 లక్షల 90 వేల హెక్టార్ల సాగుభూమి వినియోగంలో ఉంది.
- 2008-09 పంట భూమి విస్తీర్ణం 18 కోట్ల 23 లక్షల 90 వేలకు పడిపోయింది.
- ఆహార ధాన్యాల భారీ ఉత్పత్తిలో కీలకమైన పంజాబ్, పశ్చిమబెంగాల్, బీహార్, కేరళల్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.
- పంజాబ్‌లో 2006-07లో 42.29 లక్షల హెక్టార్లుగా ఉన్న సాగు భూమి 2008-09 నాటికి 42.15 లక్షల హెక్టార్లకు తగ్గింది.
- పశ్చిమబెంగాల్, బీహార్‌ల్లో 62 వేల హెక్టార్లు కుచించుకు పోయాయి. 2008-09 కాలంలోనే 1000 హెక్టార్లు తగ్గిపోయాయి.
- కేరళలో 24 వేల హెక్టార్లు భూమి సాగేతర వసరాలకు మళ్లింది.
- గుజరాత్, ఒరిస్సా, త్రిపురల్లో మాత్రం ఒక్క ఎకార సాగుభూమి తగ్గకపోవడం విశేషం.
- వ్యవసాయేతరాలకు మళ్లిన భూములు భవనాలు రహదారులు,రైల్వే లైన్ల ఏర్పాటుకు వినియోగమవు తున్నాయి.
- వ్యవసాయ భూమి పంటేతర అవసరాలకు మళ్లకుండా రైతులు, జాతీయ పునరావాసం, పున్నపరిష్కార విధానాన్ని తయారు చేసింది.



రైతు సదస్సులో చంద్రబాబు, వెంకయ్యనాయుడు, జయప్రకాశ్ నారాయణ, కిషన్‌రెడ్డి తదితరులు

# రైతులకు ఎక్కడైనా అమ్ముకునే స్వేచ్ఛ వుండాలి

## రైతు సంఘాల జాతీయ సదస్సులో వక్తల డిమాండ్

వ్యవసాయరంగం మెరుగుకు ఇప్పటికైనా సరైన చర్యలు తీసుకోకపోతే రైతాంగం మరిన్ని కష్టాల్లో కూరుకుపోతుందని, తద్వారా ఆహార భద్రతకు ముప్పు వాటిల్లుతుందని రైతు సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో జాతీయ రైతు నేతలు పేర్కొన్నారు. నూతన వ్యవసాయ విధానం తెచ్చేందుకు అన్ని పార్టీలు ఏకతాటిపైకి రావాలని భాజపా నేత వెంకయ్య నాయుడు అన్నారు. రైతులు వ్యవసాయాన్ని వదిలేయాలని చూస్తున్నారని, ఇది ఆహార భద్రతకు ప్రమాదమన్నారు. ఇతర వర్గాలన్నీ సంఘటితంగా ఉండటంతో ప్రభుత్వం వారి సమస్యలపై తక్షణం స్పందిస్తోందని, ఆఖరికి ఇద్దరు ప్రేమికులు నీళ్ల ట్యాంకు ఎక్కి బెదిరించినా వారిని సముదాయిస్తోందని, కానీ రైతులు సంఘటితంగా లేనందున వారిని పట్టించుకోవడం లేదన్నారు. నదుల అనుసంధానం అవసరమన్నాడు. కర్ణాటకలో వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ తెచ్చామని, దేశమంతా ఇలాగే తేవాలన్నారు.

### రైతంటే పిల్లనివ్వడం లేదు : చంద్రబాబు

తాను ఆమరణ దీక్ష చేసినా రైతుల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో బాధగా ఉందన్నారు. బియ్యం ఎగుమతులకు అనుమతించకపోవడంతో సరైన ధర రాక రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. వ్యవసాయం ఘోరంగా ఉండటంతో వ్యవసాయం చేస్తున్నాడంటే ఆడపిల్లలు పెళ్లిచేసుకోవడానికి సైతం ఇష్టపడటం లేదన్నారు.

### ఎక్కడ ధర ఉంటే అక్కడ అమ్ముకోనివ్వాలి : జేపీ

దేశంలో వ్యవసాయ వాణిజ్యానికి పూర్తిగా స్వేచ్ఛనివ్వాలని లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ్ అభిప్రాయపడ్డారు. ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందుబాటులోకి తేవడం. ఎక్కడ మంచి ధర ఉంటే అక్కడ రైతు అమ్ముకునే స్వేచ్ఛనివ్వడం, ఎగుమతులపై ఆంక్షలు ఎత్తివేసి ప్రపంచ రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని వివరించారు. భాజపా నేత కిషన్ రెడ్డి మాట్లాడుతూ వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో అల్పాహారం ధర రూ॥20 ఉంటే, అసెంబ్లీలో తమకు రూ॥5కే ఇస్తున్నారని, ఇదెక్కడి న్యాయమో తనకు అర్థం కావడం లేదన్నారు. అంతకుముందు రైసుమిల్లుల సంఘం నేత మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఎగుమతులపై నిషేధం వల్ల రైతులు ఎక్కువగా నష్టపోయారని చెప్పారు.

రైతు సంఘాల జాతీయ సమాఖ్య సారధ్యంలో మార్చి 26, 27 తేదీల్లో హైదరాబాద్‌లో ఈ జాతీయ సదస్సు జరిగింది. సమాఖ్య నాయకులు చెంగల్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి ప్రభృతులు ఈ సదస్సుకి సారధ్యం వహించారు. ♦

# యూత్ ఫోరం

నిర్వహణ
**కార్తీక్ చంద్ర**

**నేషనల్ బుక్ ట్రస్ట్ (NBT) - నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లయిడ్ ఎకనామిక్ రీసెర్చ్ (NCAER) వారి**

# ఇండియా యూత్ రీడర్‌షిప్ సర్వే

*దేశంలోని ఇప్పటిదాకా జరిపిన అతిపెద్ద, సాంకేతికపరంగా అత్యాధునిక "యూత్ సర్వే" నవంబర్ – డిసెంబర్ 2009లో జరిపిన ఈ సర్వేలో దేశంలోని అన్ని రాష్ట్రాలలో 207 జిల్లాలు, 199 నగరాలు, పట్టణాలలోని 6,59,569 వ్యక్తులు పాల్గొన్నారు. 21వ శతాబ్దపు భారత యువత జనాభా, స్థితిగతులు, చదివే అలవాట్లు, సమాచార మాధ్యమాల గురించి ఎన్నో ఆసక్తికరమైన అంశాలు బయటపడ్డాయి. ఉదా :*

**జనాభాలో యువత** (13-35 సం॥ మధ్య)




మొత్తం దేశ జనాభా 121.3 కోట్లు. ఇందులో యువత 38% మంది (2009 సర్వే ప్రకారం)

- **మనదేశంలోని 3/4 వ వంతు యువత (13-35 సం॥ మధ్య వయస్సు వారు) అక్షరాస్యులు**
- **అధికశాతం (2/3 మంది) అక్షరాస్యులైన యువత ఇప్పటికీ గ్రామాలలోనే ఉంటున్నారు.**

**అక్షరాస్యులలోని యువత ఎక్కడ ఉంటున్నారు?**




యువత జనాభాలో 72.8% మంది అక్షరాస్యులు (2009 సర్వే)

- **అక్షరాస్యులైన యువతలో ప్రతి 3వ వ్యక్తి స్టూడెంటే.**

**అక్షరాస్యులైన యువత - సామాజిక వర్గాలు**

(2009 సర్వే)




- **20% మంది ఎలాంటి సంపాదన లేకుండా ఇంటిపనే చేస్తున్నారు.**
- **నిలకడగా జీతం/వేతనం ఇచ్చే నౌకరీలు చేసే వారు 12% మందే.**

**అక్షరాస్యులైన యువతలో స్త్రీలు, పురుషులు** (జనాభా, కోట్లలో)

| | 2001 సెన్సస్ | 2009 సర్వే | వృద్ధిరేటు |
|---|---|---|---|
| పురుషులు | 16 (58.5%) | 18.7 (56.1%) | 1.95 % |
| స్త్రీలు | 11.3 (41.5%) | 14.6 (43.9%) | 3.23 % |
| అక్షరాస్యులైన యువత మొత్తం | **27.3 (100%)** | **33.3 (100%)** | **2.49 %** |

## యువ అక్షరాస్యులు ఏం చేస్తుంటారు?

(దేశంలోని యువ అక్షరాస్యులలో %)

| | గ్రామాలలో | నగరాలు, పట్టణాలలో | దేశంలో |
|---|---|---|---|
| నిలకడగా జీతాలు, వేతనాలు ఉన్న పని | 8.7 | 18.2 | 12.3 |
| చదువు | 31.8 | 32.6 | 32.1 |
| ఇంటిపని (వేతనం/జీతం లేకుండా) | 19.8 | 20.4 | 20.1 |
| వ్యవసాయం – అనుబంధ పరిశ్రమలులో స్వయంఉపాధి | 8.0 | 1.1 | 5.4 |
| వ్యవసాయ కూలీ పని | 8.0 | 1.6 | 5.6 |
| వ్యవసాయేతర స్వయం ఉపాధి | 7.3 | 8.3 | 7.7 |
| వ్యవసాయేతర కూలీ పని | 9.8 | 8.5 | 9.3 |
| నిరుద్యోగులు | 4.5 | 4.9 | 4.7 |

## ఖాళీ సమయంలో ఏం చేయడానికి ఇష్టపడతారు?




## సమాచారానికి మాధ్యమాలు

(యువతలో శాతం)

| | టీ.వి | న్యూస్‌పేపర్లు | రేడియో | పత్రికలు | ఇంటర్నెట్ |
|---|---|---|---|---|---|
| గ్రామాలలో | 69.9 | 45.9 | 20.6 | 12.0 | 1.3 |
| నగరాలు, పట్టణాలలో | 90.8 | 65.3 | 22.5 | 21.5 | 7.7 |
| **మొత్తం దేశంలో** | **77.8** | **53.2** | **21.3** | **15.6** | **3.7** |

## యూత్‌కి ఎలాంటి సమాచారం ?...ఏ మాధ్యమం ?

(2009 సర్వే; యువత%)

| | న్యూస్‌పేపర్లు | పత్రికలు | టీ.వి | రేడియో | ఇంటర్నెట్ |
|---|---|---|---|---|---|
| వినోదం | 9.4 | 33.2 | 53.8 | 56.6 | 14.5 |
| వార్తలు, కరంట్ అఫైర్స్ | 53.4 | 16.9 | 22.2 | 22.8 | 5.6 |
| ఆరోగ్యం | 1.1 | 10.6 | 1.5 | 2.3 | 0.3 |
| స్పోర్ట్స్ | 8.1 | 8.3 | 8.1 | 5.8 | 1.6 |
| మతం, ఆధ్యాత్మికం | 4.1 | 7.2 | 4.4 | 2.5 | 1.1 |
| ఫ్యాషన్ గురించి | 0.6 | 6.5 | 1.1 | 1.3 | 2.5 |
| రాజకీయాలు | 4.9 | 6.0 | 3.0 | 2.0 | 1.1 |
| పర్యావరణం, వాణిజ్యం మార్కెట్స్, పెళ్ళి ప్రకటనలు, వగైరా | 8.4 | 11.3 | 5.9 | 6.7 | 11.2 |

- **పరిజ్ఞానం కోసం టీవీ చూడడానికే ఎక్కువ మంది యువత (78%) ఇష్టపడుతున్నారు.**
- **న్యూస్‌పేపర్లు చదవడానికి 53% ఇష్టపడుతున్నారు.**
- **75% మంది అక్షరాస్యులైన యువత పుస్తకాలు చదవడానికి (కాలక్షేపం, వినోదం కోసమైనా) ఇష్టపడటం లేదు.**

## యువతకి ఆసక్తి కలిగించే అంశాలు ఏవి?




- **అయితే వార్తలు, కరంట్‌అఫైర్స్‌కు సంబంధించిన అంశాల కోసం యూత్ టీవీల కన్నా ఇప్పటికీ న్యూస్‌పేపర్లనే ప్రిఫర్ చేస్తున్నారు.**
- **టైం పాస్, వినోదం, జనరల్ నాలెడ్జీ కోసం పుస్తకాలను చదవడం ఎక్కువ శాతం యువత (59%) స్కూలులోనే అలవాటు చేసుకున్నారు.**

# రాష్ట్రంలో మహిళా స్వయం సహాయ సంఘాలు

**ఎ. అన్నపూర్ణ**

దేశాభివృద్ధికి ఆర్థిక శాస్త్రవేత్తలు మహిళల పాత్ర ఎంతో అవసరం – అని గుర్తించి 1982–83 సంవత్సరంలో గ్రామీణ ప్రాంత మహిళలు పిల్లలు అభివృద్ధిని కాంక్షిస్తూ "డ్వాక్రా"ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమాలను దేశంలోని ఆంధ్రప్రదేశ్‌తో పాటు 12 రాష్ట్రాలలో మొదలు పెట్టారు. ఆ తర్వాత అన్ని రాష్ట్రాలు అమలు చేస్తూ వచ్చాయి. విద్య, ఉపాధి, ఉద్యోగం ఆదాయం ఆదాయం ఆరోగ్యం గురించిన ఈ విధానాలు దేశాభివృద్ధికి మూలమని నమ్మి ప్రవేశపెట్టినప్పటికీ ఆయా రంగాలలో అభివృద్ధికి కొన్ని ఆటంకాలు వచ్చాయి. అత్యధికంగా దారిద్ర్యం, నిరుద్యోగం, నిరక్షరాస్యులు కావడం రుణ బాధలు ప్రతిబంధకాలు అయ్యాయి. ఈ పరిస్థితిలో నిరుపేదలను ఆదుకోవాలనే లక్ష్యంతో బ్యాంకుల ద్వారా రుణాలను మంజూరు చేసి గ్రామీణ మహిళల పొదుపు సంఘాలను ఏర్పాటు చేశారు. స్వయం సహాయక సంఘాలను ప్రారంభించడమూ జరిగింది. భారతీయరిజర్వ్ బ్యాంక్ ఆదేశానుసారం వ్యవసాయ గ్రామీణ అభివృద్ధి బ్యాంక్, జాతీయ వాణిజ్య బ్యాంకులు సహకార బ్యాంకులు పొదుపు సంఘాలకు సౌకర్యం కల్పించాయి. దేశంలోనే అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లో 15 సం॥లుగా స్వయం సంఘాలు పెరిగాయి. సభ్యుల సంఖ్యా పెరిగింది.



ఇవి లెక్కల్లో చెప్పాలంటే 2009–10 సం॥లో 9,49,066 సంఘాలు ఏర్పడ్డాయి. ఇందులో 1,06,75321 మంది మహిళలు సభ్యులుగా చేరారు. మొత్తం వారి పొదుపు 887.47 కోట్ల రూపాయలు మొత్తం రాష్ట్రంలో 36,391 గ్రామస్థాయి ఆర్గనైజర్లు పనిచేస్తున్నారు. 1099 మండలాల్లో సమాఖ్యలు, 22 జిల్లా సమాఖ్యలు ఏర్పడ్డాయి.

**మహిళలు సాధికారత**

మహిళల్లో పొదుపే కాకుండా ఇతర సామాజిక లక్ష్యాలైన బిడ్డల ఆరోగ్యం విద్య వసతులు గ్రామాల్లో చైతన్యం ఏర్పడ్డాయి. ఆర్థిక కార్యకలాపాల పట్ల సంఘ పరమైన సమస్యలను అర్థంచేసుకోవడం, సామాజిక పరమైన లక్ష్యాలను సాధించాలనే తపన ప్రారంభమైంది. పిల్లల విద్య ఆరోగ్యం పట్టించుకోగల స్థాయికి చేరుకున్నారు. అంతేకాకుండా సామాజిక రాజకీయ రంగాలలో ప్రవేశానికి ఉత్సాహం చూపించి ఎదిగిన వారు వున్నారు. బ్యాంక్ గురించి తెలియని మహిళలు ఖాతాలు ప్రారంభించి రుణాలను తీసుకునే స్థాయికి చేరుకున్నారు. స్త్రీలు ప్రోత్సాహాన్ని ఆత్మగౌరవాన్ని నాయకత్వ లక్షణాలను కల్పించుకోగల దిశగా ముందుకు సాగుతూ మహిళా సాధికారత సాధించారని చెప్పవచ్చు. దేశ సామాజికాభివృద్ధిలో పురోగతిని సాధించగలిగారు. అయితే కాలక్రమాన ఇంతటితో వారి ఆశయాలు ఫలించలేదు.

మహిళలు పొదుపు చేసుకున్న స్థాయి ఒక పరిధికే మిగిలి పోయింది. పొదుపు సంఘాల ద్వారా ఉత్పత్తి అయిన వస్తువులకు మార్కెట్ ప్రోత్సాహం లేకపోగా విదేశాల స్వేచ్ఛా మార్కెట్ వస్తువులు తక్కువ ధరకు లభించడం నాణ్యత లేకున్నా ఆకర్షణా మోజుతో నగరవాసులు విదేశీ వస్తువులకు ఎగబడటంతో గ్రామీణ మహిళలు నిరుత్సాహానికి లోనవుతున్నారు. ఈ ఆటంకాలకు తోడు పొదుపు సంఘాల ఉనికి పురోగతికి వేధింపులు కూడా తోడవటంతో ఆందోళనకు గురవుతుండటం విచారం కలిగిస్తోంది. వాణిజ్య బ్యాంకులు రుణాలు ఇవ్వడంలో ఆసక్తి కనబరచడంలేదు. దీంతో పేదల పాలిట "కల్పవృక్షం" పేరుతో కొన్ని సూక్ష్మరుణ సంస్థలు రంగప్రవేశం చేశాయి.

కార్పొరేట్ మైక్రోఫైనాన్స్ కంపెనీలు అనేక గ్రామాలలో స్వయంసహాయక సంఘాలతో పనిచేస్తూ మహిళలను 10 మంది లేక 15 మందితో కృత్రిమంగా గ్రూపులు ఏర్పాటుచేసి ఒకేసారి 10,000 వేలనుంచి 20,000 వరకూ అప్పులు ఇచ్చి 40 నుంచి 50 వారాలలోపున వాయిదాల చెల్లింపు నిర్ణయించి వసూలు చేయసాగాయి. కంపెనీలు నియమించిన ఉద్యోగులు నెలనెలా చిట్టి చెల్లింపులను వసూలు చేస్తూ ఇచ్చిన అప్పు మొత్తానికి 1.5 నుంచి 2 శాతం రేటు వడ్డీని నిర్ణయించి క్రమం తప్పకుండా చెల్లించే విధంగా ఒప్పించడం చేస్తున్నారు. రూ॥10.000 లకు రూ॥350 ముందే వసూలు చేస్తున్నారు. ఆ గ్రూపుకు చెందిన వారి చేతనే హామీ సంతకాలు చేయించుకుంటున్నారు. సభ్యురాలి ఫోటో, ఆమె భర్త ఫోటో, రేషన్ కార్డు, ఇంటి పత్రాలను తాకట్టుపెట్టే విధంగా ఈ వ్యవహారమంతా నడుస్తుంది. ఈ సమయంలో ఎవరినీ అనుమతి ంచరు ఎందుకంటే ఇందులో వుండే అవకతవకలు బయట పడకుండా జాగ్రత్త పడటానికి.

క్రమంగా ఈ మోసాన్ని గ్రహించిన మహిళలు ఆగ్రహంతో ఫైనాన్స్ సంస్థలపై ఉద్యమాలకు సిద్ధపడ్డారు. ఈ సంస్థలు తెలంగాణా వైపు మళ్ళిపోయాయి. అక్కడ బలమైన శక్తిగా స్థిరపడిపోయాయి. ముఖ్యంగా వీరి దృష్టి దళితవాడలు, తండాలు , పట్టణాలలోని అసంఘటిత కార్మికులు, వలస కార్మికులపై వుంటుంది. ఈ వర్గాల వారికి తీవ్రమైన సమస్యలుండటం వలన వారికి లాభిస్తుంది. ఈ సంస్థల అధినేతల స్వలాభంతో ప్రభుత్వం నిర్దేశించిన దానికన్నా ఎక్కువగా వడ్డీలు విధించి సకాలంలో చెల్లించనందుకు అపరాధ రుసుము ఇతర ఖర్చులు వసూలు చేస్తూ ప్రజలను అప్పుల ఊబిలోకి తీసుకుపోతున్నారు. పేదల ఆర్థిక ఇబ్బందులను ఆసరాచేసుకుని దుర్వినియోగానికి పాల్పడుతూ యధేచ్ఛగా మోసాలు చేస్తున్నారు. దీంతో ప్రజలు అనేక ఇబ్బందుల పాలవుతున్నారు. హామీగా సంతకం చేసిన సభ్యులు నిర్దయగా ఇంటిముందు ధర్నాలు చేయడంతో ఆస్తులను అమ్ముకోవడం, ఇల్లు విడిచి పారిపోవడం,

( తరువాయి 28వ పేజీలో...)

**రాష్ట్రంలో మహిళా స్వయం సహాయ సంఘాలు** (2001 మార్చి 31)

| S. No | District | No.of Mandals | No.of VO's | No.of SHG Groups | No.of SHG Members |
|---|---|---|---|---|---|
| 1. | Adilabad | 52 | 1,590 | 34,200 | 365,373 |
| 2. | Anantapur | 63 | 2,559 | 54,421 | 455,571 |
| 3. | Chittoor | 66 | 1,943 | 65,806 | 574,490 |
| 4. | East Godavari | 58 | 1,948 | 92,217 | 742,481 |
| 5. | Guntur | 57 | 1,630 | 60,472 | 475,778 |
| 6. | Kadapa | 50 | 1,346 | 35,812 | 294,121 |
| 7. | Karimnagar | 57 | 1,917 | 53,376 | 571,697 |
| 9. | Krishna | 46 | 2,223 | 52,672 | 437,057 |
| 10. | Kurnool | 54 | 1,647 | 49,059 | 395,884 |
| 11. | Mahabubnagar | 64 | 2,294 | 52,833 | 513,599 |
| 12. | Medak | 46 | 1,457 | 41,830 | 423,066 |
| 13. | Nalgonda | 59 | 1,827 | 71,467 | 534,595 |
| 14. | Nellore | 46 | 1,383 | 42,899 | 322,215 |
| 15. | Nizamabad | 36 | 1,043 | 41,510 | 361,659 |
| 16. | Prakasam | 56 | 1,868 | 54,487 | 393,409 |
| 17. | Ranga Reddy | 33 | 1,154 | 35,030 | 309,050 |
| 18. | Sikakulam | 38 | 1,154 | 45,014 | 418,672 |
| 19. | Visakhapatnam | 39 | 1,774 | 48,170 | 476,004 |
| 20. | Vizianagaram | 34 | 1,246 | 36,906 | 366,894 |
| 21. | Warangal | 50 | 2,042 | 54,296 | 521,523 |
| 22. | West Godavari | 46 | 1,856 | 65,764 | 526,370 |
| | **Total** | **1099** | **37814** | **1145789** | **9950599** |

# బ్యాంకు అప్పుల్లో మహిళా పొదుపు సంఘాలు



ఆంధ్రప్రదేశ్‌లో మహిళా పొదుపు సంఘాల పరిస్థితి రానురాను ఆందోళన కరంగా మారుతున్నది. గత సంవత్సరం మైక్రోఫైనాన్స్ కంపెనీల ఘాతుకాలు వెలుగు చూశాయి. తెచ్చిన అప్పులు తీర్చడానికి ఒకటికి నాలుగు చోట్ల అప్పులు చేసి చివరికి వడ్డీల ఊబిలో నుండి బైటకురాలేక, ఫైనాన్స్ కంపెనీల ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్యల పరం పర రాష్ట్రాన్ని ఎంతో విషాదంలో ముంచింది. మైక్రోఫైనాన్స్ ఆగడాలను అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్సును తెచ్చింది. ఒక పక్క ఆర్డినెన్సు, మరోపక్క మహిళలలో పెరిగిన చైతన్యంతో ఫైనాన్స్ కంపెనీల దౌర్జన్య కాండకు కొంత అడ్డుకట్ట పడింది.

ఇప్పుడు తాజా వార్తలు చూస్తే మహిళా పొదుపు సంఘాలు ప్రభుత్వ రంగం బ్యాంకుల అప్పుల భారంతో సతమత మౌతున్నట్లు స్పష్టం అవుతున్నది. 2010 అక్టోబరు 31నాటికి మహిళా పొదుపు సంఘాలు ఈ బ్యాంకులకు చెల్లించకుండా నిలిచిపోయిన మొత్తం 2098 కోట్లుగా తేల్చారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్లకమిటీ (యస్.యల్.బి.సి) నివేదిక ప్రకారం రాష్ట్రంలో 10 లక్షల మంది పొదుపుసంఘాల సభ్యులు అప్పులు తిరిగి చెల్లించడంలో విఫలం అయ్యారని పేర్కొంది. వీరు చెల్లించాల్సిన మొత్తం 2,098 కోట్లుగా తేల్చింది. మొత్తం ఇచ్చిన అప్పులలో 16.42 శాతం తిరిగి రాకుండా ఉండిపోయిందని ప్రకటించింది. పరిస్థితి ఇక్కడితో ఆగలేదు. 2011 జనవరి నాటికి బ్యాంకుల లెక్కల ప్రకారం 70 శాతం మాత్రమే తిరిగి చెల్లింపులు జరుగుతున్నాయని మిగిలినది బకాయిలుగా మిగిలివున్నాయని తెలిపింది. అంటే తిరిగి చెల్లింపులో లేనిశాతం 30 శాతానికి పెరిగింది. దాదాపు 2823 కోట్ల రూపాయల అప్పు బకాయిలుగా కనిపిస్తున్నాయి. ఇవి ఒక పక్క బ్యాంకర్లకు ఆందోళన కలిగిస్తుంటే మరోపక్క మహిళా పొదుపు సంఘాల దయనీయ పరిస్థితికి అద్దం పడుతుంది.

గతంలో మహిళా పొదుపు సంఘాలకు రుణాలివ్వడానికి బ్యాంకులు ఉత్సాహాన్ని చూపించాయి. ఎందుకంటే ఈ పొదుపు సంఘాలు తిరిగి చెల్లింపులలో ముందున్నాయి. 95శాతం రికవరీతో చాలా సజావుగా సాగింది. కాని ఇప్పుడు పరిస్థితి బాగా దిగజారింది దీంతో బ్యాంకులు కొత్తరుణాలు ఇవ్వడం మీద కంటే పాత బాకీల వసూళ్లమీద ప్రధానంగా దృష్టి

సారిస్తున్నాయి. 2011 జనవరిలో రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ ఈ అప్పుల వసూళ్లకు తగిన చర్యలు తీసుకోవాలని అన్ని బ్రాంచీల మేనేజర్లకు ఆదేశాలను జారీ చేసింది. బ్రాంచీల వారీగా అప్పులు చెల్లించని వారి జాబితాలను సిద్ధం చేసి వసూళ్లకు వివిధ సంస్థల సహకారాన్ని తీసుకోవాలని సూచించింది.

మహిళా పొదుపు సంఘాలతో, బ్యాంకు రుణాల రికవరీలో పాత్రధారులుగా వున్నా గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ (యస్.ఇ.ఆర్.పి) జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డి.ఆర్.డి.ఎ) ఇతర ప్రభుత్వ సంస్థలతో పాటు స్థానికంగా ఏర్పాటు చేసిన "సామాజిక అప్పుల చెల్లింపు సంస్థల"తో కలిపి చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని బ్యాంకర్ల కమిటీ సూచించింది. ఏమైనా రాష్ట్ర వ్యాపితంగా ఈ సారి ప్రభుత్వరంగ బ్యాంకులు అప్పుల వసూళ్లకు వత్తిడి పెంచడం ప్రారంభం కానుంది. మైక్రోఫైనాన్స్ కంపెనీలలా కాకుండా ఆత్మహత్యలకు మళ్లీ తెరతీసే పరిస్థితి రాకుండా తగిన సంయమనాన్ని ఈ సంస్థలు పాటిస్తాయని భావిద్దాం.

పోతే అసలు సమస్య ఇలా మహిళ పొదుపు సంఘాలు ఎందుకు అప్పులలో కురుకుపోతున్నాయో ప్రభుత్వం, అప్పులిచ్చే సంస్థలు అధ్యయనం చెయ్యడం, ఈ పొదుపు సంఘాలు లాభాలబాటలో పడడానికి తగిన పథకాలను యోచించడం తక్షణం జరగాల్సిన పని.

పావలా వడ్డీ

ప్రారంభమైన గత 5,6 సంవత్సరాల అనుభవాలని చూస్తే ఈ మహిళా పొదుపు సంఘాలు మూడు రకాలస్థితిలో వున్నట్లు కనిపిస్తుంది. ఒకటి ఈ రుణాలను పెట్టుబడిగా పెట్టి వాటి నుండి కొంత ఉత్పత్తి సాధించి ఆదాయం పెంచుకున్న గ్రూపులో వున్నాయి. రెండవ తరహా ఈ అప్పుల్ని ఆదాయంగా మార్చడంలో పెద్దగా విజయాలు పొందలేక ఎదుగుబొదుగూ లేకుండా వున్నాయి. మూడో తరహా ఈ రుణసదుపాయాన్ని తక్షణ అవసరాలకు వినియోగించుకుని ఎలాంటి అదనపు ఆదాయం రాక అప్పు-వడ్డీ చెల్లించలేని స్థితి కనిపిస్తున్నది.

### ప్రభుత్వరంగ బ్యాంకులలో పొదుపు సంఘాల అప్పులు (2001 మార్చి 31)

| S. No | District | No. of Outstanding SHG Loans | Loan Outstanding Rs(Crores) | Loan Repayment details Rs (Crores) | | | %of Recovery |
|---|---|---|---|---|---|---|---|
| | | | | Demand | Collection | Balance | |
| 1 | Adilabad | 26,574 | 203.91 | 210.38 | 143.99 | 66.39 | 68 |
| 2 | Anantapur | 44,450 | 435.76 | 406.78 | 307.34 | 99.44 | 76 |
| 3 | Chittoor | 49,431 | 755.06 | 704.83 | 512.22 | 192.61 | 73 |
| 4 | East Godavari | 70,554 | 743.74 | 880.69 | 679.19 | 201.50 | 77 |
| 5 | Guntur | 46,543 | 6,174.52 | 484.69 | 329.73 | 154.97 | 68 |
| 6 | Kadapa | 27,515 | 317.89 | 290.77 | 191.25 | 99.52 | 66 |
| 7 | Karimnagar | 44,716 | 525.21 | 447.40 | 303.57 | 143.82 | 68 |
| 8 | Khammam | 42,312 | 3,004.23 | 402.63 | 235.48 | 167.15 | 58 |
| 9 | Krishna | 46,369 | 627.60 | 656.82 | 443.47 | 213.35 | 68 |
| 10 | Kurnool | 32,695 | 339.04 | 361.36 | 235.43 | 125.93 | 65 |
| 11 | Mahabubnagar | 36,724 | 304.75 | 329.32 | 200.41 | 128.91 | 61 |
| 12 | Medak | 32,360 | 350.13 | 386.87 | 281.78 | 105.09 | 73 |
| 13 | Nalgonda | 46,098 | 308.50 | 353.00 | 234.83 | 118.17 | 67 |
| 14 | Nellore | 27,855 | 294.97 | 329.34 | 234.40 | 94.94 | 71 |
| 15 | Nizamabad | 30,558 | 303.42 | 331.24 | 252.76 | 78.48 | 76 |
| 16 | Prakasam | 39,365 | 377.18 | 427.19 | 325.98 | 101.21 | 76 |
| 17 | Ranga Reddy | 24,240 | 266.07 | 271.35 | 184.35 | 86.99 | 68 |
| 18 | Srikakulam | 34,207 | 407.94 | 404.99 | 252.20 | 152.78 | 62 |
| 19 | Visakhapatnam | 33,895 | 470.25 | 410.64 | 289.43 | 121.21 | 70 |
| 20 | Vizianagaram | 27,134 | 261.91 | 354.84 | 288.92 | 65.92 | 81 |
| 21 | Warangal | 39,290 | 321.62 | 325.69 | 203.07 | 122.62 | 62 |
| 22 | West Godavari | 53,841 | 620.47 | 665.05 | 482.68 | 182.37 | 73 |
| | **Total** | **856,726** | **17,414.15** | **9,435.86** | **6,612.49** | **2,823.37** | **70** |

ఈ మహిళా పొదుపు సంఘాలలో అత్యధికులు పేదలు బడుగు, బలహీనవర్గాలకు చెందినవారు. తక్కువ చదువు, లేదా నిరక్షరాస్యు లుగా వున్నారు. స్వయం సహాయక సంఘాలు వీరిలో కొత్త ఉత్సాహాన్ని, ఆశల్ని రేకెత్తించాయి. ఏదో చెయ్య లన్నా తపన, తమ కాళ్లమీద నిలబడాలనే కాంక్షనీ కలిగించాయి. ఇలాంటి సంఘటిత శక్తికి కార్యరూపం ఇచ్చే నైపుణ్యం వారికి అంతగా లేదు. ప్రభుత్వ అలాంటి అవకాశాలను కల్పించే కొత్త కొత్త పథకాలను రూపొందించడం లేదు. కొత్త తరహా వస్తూత్పత్తికి నాటికి మార్కెట్ కల్పనకు ఏర్పాట్లు జరగడం లేదు. అందుచేత ఈ సంఘాలు ప్రాథమిక స్థాయి దాటి ఎదగలేని స్థితిలో వుండిపోతున్నాయి.

ప్రభుత్వం తక్షణం ఈ మహిళా పొదుపు సంఘాల మీద వాటి కార్యకలా పాలమీద ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. తక్షణమే ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చెయ్యడానికి సిద్ధం కావాలి.

పొదుపు సంఘాలు తీసుకునే రుణాలు కచ్చితంగా వారి ఆదాయాభివృద్ధికి దోహదం చేసే అంశాలకే వినియోగించేలా కట్టడి చెయ్యాలి. పొదుపు సంఘాల స్థాయిని బట్టి అవసరమైన నైపుణ్యాలను అందించడానికి ఒక క్రాష్ ప్రోగ్రాంను ప్రకటించాలి.

పొదుపు సంఘాల ఉత్పత్తులకు స్థిరమైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలి.

గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయాధారిత కుటీర పరిశ్రమలకు అదనపు విలువ ఉత్పత్తులకు ఈ స్వయం సహాయ సంఘాలను వినియోగించుకోవాలి.

వ్యక్తులుగా, సమిష్టిగా ఉత్పత్తులు పెంచడంలో ఈ సంఘాలను వారి పొదుపును, బ్యాంకుల రుణాలను సద్వినియోగ పర్చడానికి నిర్దిష్టమైన ప్రాజెక్టులను రూపకల్పన చెయ్యాలి.

ఈ ఉత్పత్తుల అమ్మకాలకు ప్రత్యేక సదుపాయాలు ప్రత్యేక సంస్థల ఏర్పాట్లు జరగాలి.

రాష్ట్రంలో ఉవ్వెత్తుగా వచ్చిన మహిళా చైతన్యాన్ని ఎట్టి పరిస్థితులలోనూ నీరుగార్చకుండా, ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. ♦

**మహిళా పొదుపు సంఘాలు అప్పల వినియోగం**

**ఉత్పత్తి అవసరాల కోసం**

| | |
|---|---|
| – పాడిపశువుల కొనుగోలు కోసం | 46 శాతం |
| – వ్యవసాయ పెట్టుబడుల కోసం | 2 శాతం |
| – చిన్న వ్యాపారాల కోసం | 11శాతం |
| – సీజనల్ వ్యాపారం కోసం | 12 శాతం |

**ఆస్తుల వృద్ధి కోసం**

| | |
|---|---|
| – ఇల్లు, బోరుబావి, భూముల కొనుగోళ్లు | |
| – టీ.వి. మోటారుసైకిలు వగైరాలలో ఏదో ఒకదానికి | 5 శాతం |

**ఇతర అవసరాల కోసం**

| | |
|---|---|
| – ఆహార ధాన్యాల వినియోగానికి | 17.5 |
| – శుభకార్యాల కోసం | 2.5 |
| – వడ్డీ చెల్లింపుల కోసం | 2.00 |
| – విద్య, ఆరోగ్యాల కోసం | 2.00 |

**(17వ పేజీ తరువాయి...)**

కొందరు అవమానంతో ఆత్మహత్య చేసుకోవడం జరుగుతోంది.

వందలాది సంవత్సరాల తర్వాత పేదవర్గాలవారి అభివృద్ధికి మహిళల సాధికారతకు ఆవిర్భవించిన స్వయం సహాయక సంఘాలను నిర్వీర్యంచేస్తుంటే ప్రభుత్వాలు అరికట్టాలి. లేకుంటే ఎదుగుతున్న మహిళాశక్తికి ఆటంకంగా మారుతుంది. వారి ఆత్మవిశ్వాసం దెబ్బతింటుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నా భిన్నమవుతుంది. మైక్రోఫైనాన్స్ కంపెనీల అక్రమవసూళ్ళు నిర్భంధం మహిళలు సాధికారతకు గొడ్డలిపెట్టు కాగలదు. ఇప్పుడిప్పుడే ధైర్య సాహసాలతో బిడ్డల భవిష్యత్ దేశ పురోగతి తీర్చిదిద్దే మహిళాశక్తి భవిష్యత్‌లో అంతరించిపోగలదు. గ్రామీణ ఆర్థిక స్థితికి కారణభూతులైన మహిళలు చిన్నాభిన్నమై బ్రతుకు తెరువుకోసం నగరాలను ఆశ్రయించవలసిన స్థితి ఏర్పడుతుంది. ఎప్పుడో క్రీస్తు పూర్వపు రోజులకు తిరోగమించబడి "వడ్డీ వ్యాపర" వ్యవస్థకు చేజేతులా అప్పగించాల్సిన ప్రమాదం కలుగుతుంది. అవకతవకలను అరికట్టి ప్రజలను దోచుకునే ఫైనాన్స్ కంపెనీలను నిర్వీర్యం చేయాలి. బ్యాంకుల ద్వారానే తక్కువ వడ్డీకి అవసరమైన స్థాయిలో రుణాలు అందిస్తూ మహిళా సాధికారతకు కృషి చేసిన రోజునే మహిళలను గౌరవించినవారు కాగలరు. ప్రభుత్వం మహిళలకు తగిన ఉపాధి అవకాశాలను కల్పించినప్పుడు రుణాలను సక్రమంగా చెల్లిస్తారు. వారి జీవితాల్లో సుఖసంతోషాలు వుంటాయి. ♦

# జిల్లాలలో లోక్‌సత్తా కార్యకలాపాలు







**చిలకలూరిపేట :**

**అవినీతి రహిత సమాజాన్ని నిర్మిద్దాం :**

దేశంలో అవినీతి అంతానికి, విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని తిరిగి తీసుకురావాలనే డిమాండ్లతో పీపుల్ ఫర్ లోక్‌సత్తా తదితర ప్రవాస భారతీయ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అమెరికాలో జరుగుతున్న దండియాత్ర–2కు సంఘీభావంగా లోక్‌సత్తా పార్టీ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కళామందిర్ సెంటర్ నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు 'యువతా మేలుకో..దేశాన్ని ఏలుకో" అంటూ నినాదాలు చేస్తూ వందలాది మంది విద్యార్థులు, యువకులు ఈ ర్యాలీ లో పాల్గొన్నారు. అనంతరం తహశీల్దార్ కె.చంద్రశేఖరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లోక్‌సత్తా నియోజకవర్గ ఇంఛార్జీ భానుప్రసాద్ మాట్లాడుతూ.. రాజకీయ నాయకులు, ఉన్నతాధికారుల అవినీతి దేశాభివృద్ధికి ఆటంకంగా మారిందన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ జబ్బార్, పార్టీ నాయకులు షేక్ సాధిక్, మురికిపూడి ప్రసాద్, కామినేని ఆంజనేయులు, సాంబశివరావు, రవి, అస్లాం, మద్ది మహేష్, ఆర్కిటెక్ట్ జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

**అనంతపురం**

**రాష్ట్రంలో అనిశ్చితి తొలగించండి**

**రాయదుర్గం :** రాష్ట్రంలో అభివృద్ధికి, శాంతి భద్రతలకు తీవ్ర విఘాతం కలిగిస్తున్న తెలంగాణ సమస్యను అసెంబ్లీలో చర్చించి అన్ని ప్రాంతాలను సంతృప్తి పరిచే విధంగా పరిష్కారాన్ని సాధించేందుకు స్థానిక ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి కృషి చేయాలని లోక్‌సత్తా పార్టీ తాలుకా అధ్యక్షుడు బి.బాబు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అసెంబ్లీలో సమస్య పరిష్కారానికి కృషి చేయాలంటూ ఎమ్మెల్యే రామచంద్రారెడ్డికి లోక్‌సత్తాపార్టీ నాయకులు, విద్యార్థులు పోస్టుకార్డులను పంపారు.

**విశాఖపట్నం**

**ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేదించాలంటూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత**

**విశాఖపట్నం :** ప్లాస్టిక్ వాడకం వల్ల నగరంలో పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించాలంటూ విద్యార్థిసత్తా ప్రతినిధులు కలెక్టర్ శ్యామలరావుని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్లాస్టిక్ వాడకం వల్ల నగరవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను వారికి తెలియజేశారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి త్వరలో తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిరణ్ కుమార్, శశిధర్, ప్రసాద్, పూజిత, అజిత్‌కుమార్, ప్రనీత, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

**శ్రీకాకుళం**

**కాల్పుల సంఘటనపై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ జరపాలి**

**డాబాగార్డెన్స్ :** శ్రీకాకుళం జిల్లా కాకరాపల్లి వడ్డితాండ్రలో జరిగిన దాడులపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని లోక్‌సత్తా యూత్ వింగ్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ డిమాండ్ చేస్తూ జీవిఎంసీ గాంధీ విగ్రహం వద్ద



నిరసన తెలిపారు. థర్మల్ ప్రాజెక్ట్ నిర్మాణాలు తక్షణం ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామ్ శశిధర్, చైతన్య, అజిత్, శర్మ తదితరులు పాల్గొన్నారు.

**ఖమ్మం**

**ఎస్సీ, ఎస్టీ సంఘం కార్యదర్శికి వినతులు**

**మామిళ్ళగూడెం :** జిల్లాలోని విద్యారంగం, దళితుల సమస్యల పరిష్కారానికి కోరుతూ ఎస్సీ, ఎస్టీ సంఘం కార్యదర్శి ఆర్.సుబ్బారావుకు విద్యార్థిసత్తా జిల్లా సమన్వయకర్త కన్నెబోయిన మహేష్‌యాదవ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేయడం జరిగింది. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఫీజు రీఎంబర్స్‌మెంట్లు ఇప్పించాలని, కార్పొరేషన్ ద్వారా నిధులు పెంచి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, క్రాంతి, రాంబాబు, వీరేశ్, ఉపేందర్ పాల్గొన్నారు.

**చిత్తూరు**

**సభ్యత్వ నమోదులో లోక్‌సత్తా**

**మదనపల్లి :** లోక్‌సత్తా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా అధికార ప్రతినిధి వి.నాగేశ్వరరావు మదనపల్లి పట్టణ ప్రధాన కూడలిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పౌరులందరు రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తంబళ్ళపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కె.సూర్యనారాయణ, పట్టణ అధ్యక్షులు దివాకర్, కార్యదర్శి మధుసూదన్, కోశాధికారి శ్రీనివాసులనాయుడు, రామిరెడ్డి పాల్గొన్నారు

**ప్రకాశం**

**లోక్‌సత్తా జెండా ఆవిష్కరణ**

**కనిగిరి (హనుమంతునిపాడు):** మండలంలోని సీతారాంపురం గ్రామంలో లోక్‌సత్తా పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి పెనుబాకల చెంచురామయ్య మాట్లాడుతూ..ప్రతి గ్రామంలో పది మంది లోక్‌సత్తా కార్యకర్తలను తయారు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ, ఎం.బాలకృష్ణారెడ్డి, వెంకట్రావు, సుందరరావు, కె.శివన్నారాయణ, జివి రావు, నాగేశ్వరరావు, ఖాశిం, అల్లాబకాష్, విజయలక్ష్మి, నాగభూషణం పాల్గొన్నారు.


## FORM IV

1. Place of Publication : Hyderabad
2. Periodicity of its publication : Fortnightly
3. Printer's Name : Dr. Jaya Prakash Narayan
   Nationality : Indian
   Address : Flot No. B-504, Pasha Court, Somajiguda, Hyderabad-500082 (A.P)
4. Publisher's Name : Dr. Jaya Prakash Narayan
   Nationality : Indian
   Address : Flot No. B-504, Pasha Court, Somajiguda, Hyderabad-500082 (A.P)
5. Editor's Name : Dr. Jaya Prakash Narayan
   Nationality : Indian
   Address : Flot No. B-504, Pasha Court, Somajiguda, Hyderabad-500082 (A.P)
6. Name and Address of individual who own the newspaper : Dr. Jaya Prakash Narayan
   Indian
   Flot No. B-504, Pasha Court,
   Somajiguda, Hyderabad-500082 (A.P)

   and partners or shareholders holding More than one per cent of the total capital. NA

I, Dr. Jaya Prakash Narayan hereby declare that the particulars given above are true to the best of my knownledge and belief.

Date: 1st March 2011

(Sd) (Jaya Prakash Narayan)
Signature of the Publisher







తమిళనాడు అసెంబ్లీకి పోటీ చేస్తున్న లోక్‌సత్తా పార్టీ (మక్కల్ శక్తి కచ్చి) అభ్యర్థులతో రాష్ట్ర పార్టీ నేతలు బండారు రామ్మోహన్ రావు, సర్రా శ్రీధర్



అవినీతికి వ్యతిరేకంగా లోక్‌సత్తా పార్టీ
మిర్యాలగూడ పట్టణంలో ఊరేగింపు



మిర్యాలగూడలో శాసన సభ్యులు జూలకంటి రంగారెడ్డి కి విజ్ఞప్తి చేస్తున్న లోక్‌సత్తా నేతలు




అసెంబ్లీలో చర్చించండి -అనిశ్చితి తొలగించండి అన్న నినాదంతో రాయదుర్గంలో ర్యాలీ



అమెరికాలో ఎన్నారైల దండీయాత్రకు -2 సంఘీభావంగా
రాష్ట్రంలో ' యూత్ ఫర్ బెటర్ ఇండియా" (వైబిఐ) కార్యక్రమాలు



(వైబిఐ) కార్యకలాపాలు
నిర్వహించిన ప్రాంతాలు
హైదరాబాద్
విజయవాడ
శ్రీకాకుళం
విజయనగరం
ప్రొద్దుటూరు
తిరుపతి, బద్వేల్
నంద్యాల
మార్కాపురం
గూడూరు
ఒంగోలు, కడప



RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2010-12



## అవినీతి రహిత భారతదేశం కోసం అమెరికాలో ఎన్నారైల దండియాత్ర - 2

**2011 మార్చి 12 -26 వరకు - 240 మైళ్ళ పాదయాత్ర**

(శాన్‌డీగో లోని మార్టిన్ లూథర్‌కింగ్ మెమోరియల్ పార్క్ నుంచి శాన్ ఫ్రాన్సిస్కోలోని గాంధీ విగ్రహం వరకు)

To,

Book-Post
PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times
H.No. 5-10-180/A&A1,
Band Lanes, Hill Fort Road,
Hyderabad- 500 004.

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad